ఉపాధ్యాయ దినోత్సవ ప్రత్యేకం

గురువులకు వందనం!



చిన్ననాట గురువులు విద్యార్థుల ఆలోచనల్లో నాటిన విత్తనం.. చదువులోనే కాదు వ్యక్తిత్వ వికాసంలోనూ కీలకంగా మారుతుంది. అందుకే ఏ స్థాయికి ఎదిగినా గురువులను తలచుకుంటారు. తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సంజామల వెంకటేశ్వర్.. తనకు దారి చూపిన గురువులను ఇలా గుర్తు చేసుకుంటూ నమస్కరించుకుంటున్నారు.

గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో నైతిక విలువల బోధనకు ప్రాధాన్యత వుండేది. ప్రత్యేకంగా దానికంటూ కొన్ని క్లాసులు తీసుకునేవారు. పాఠ్యాంశాల్లో కూడా నైతిక విలువలకు సంబంధించిన ఇతివృత్తాలు వుండేవి. ఇపుడు వాటిని తగ్గించేయడం, పూర్తిగా తొలగించడం చేస్తున్నారు. ప్రాథమిక విద్యలో పిల్లలకు మాతృభాషలోనే సబ్జెక్టులు బాగా అర్థమవుతాయి. దానికోసం తెలుగు భాషా బోధనపై దృష్టి సారించాల్సిన అవసరముంది.

పాఠశాలల్లో కేవలం పాఠ్యపుస్తకం చదివి టీచ్ చేయడం సరిపోదు. అవసరమైన బొమ్మలు, దృశ్యాలు, మ్యాపులు, డ్రాయింగులు వంటివి ఉపయోగించాలి. ఉదాహరణలు చూపాలి. కేవలం కాన్సెప్టులు మాత్రమే బోధిస్తే పిల్లలకు అర్థం కాదు. వీటన్నింటికీ మించి సామాజిక బాధ్యత కలిగిన ఉపాధ్యాయులు పిల్లల పాలిట మెంటర్లుగా మారాలి.


● తిరుపతి కలెక్టర్ డాక్టర్ సంజామల వెంకటేశ్వర్

హైస్కూల్‌లో సెబాస్టియన్ సార్

ఫస్ట్ క్లాస్ నుంచీ టెన్త్ వరకూ గుంటూరు లయోలా పబ్లిక్ స్కూల్లో చదువుకున్నా. అప్పట్లో మాకు కెమిస్ట్రీ టీచర్‌గా సెబాస్టియన్ వుండేవారు. కేవలం తన సబ్జెక్టుకే పరిమితమయ్యేవారు కాదు. ఇతర అంశాలు చెప్పేవారు. మంచిచెడులు వివరిస్తూ పిల్లల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడానికి ప్రయత్నించేవారు. హైస్కూలు స్థాయి లోనే కెరీర్ వైపు దృష్టి మళ్లించారు. నాకు కూడా కెరీర్ కౌన్సిలింగ్ ఇచ్చి గైడ్ చేసింది తనే.


సివిల్స్ దిశగా.. ప్రొఫెసర్ కృష్ణబాబు

విశాఖ ఆంధ్రా మెడికల్ కాలేజీలో మెడిసిన్ చేస్తున్న సమయంలో ఎస్పీఎం (సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్) ప్రొఫెసర్ కృష్ణబాబు టీచింగ్ నన్ను బాగా ప్రభావితం చేసింది. సివిల్స్ వైపు దృష్టి మరల్చింది కూడా వారే. జీవితంలో తల్లిదండ్రుల్ని మినహాయిస్తే నన్ను ఓ వ్యక్తిగా తీర్చిదిద్దడంలో ఈ ఇద్దరి పాత్ర ఎక్కువ. గురుపూజోత్సవ దినాన వారిని గుర్తు చేసుకుంటూ వందనం సమర్పించుకుంటున్నా.



తిరుపతి ఆంధ్రజ్యోతి

అర్థశాస్త్ర నిపుణుడైన ఆచార్య కూతాటి వెంకటరెడ్డి ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ అధ్యాపకుడిగా 36 ఏళ్లు ఎందరో శిష్యులను తీర్చిదిద్దారు. అనంతపురం ఎస్కే యూనివర్శిటీ వైస్ చాన్సలర్‌గా చేసి రిటైరైన ఆయన ప్రస్తుతం తిరుపతి ఎస్వీ నగర్‌లో విశ్రాంత జీవితం గడుపుతున్నారు. 93 ఏళ్ల వెంకటరెడ్డి ఇటీవలే తన ఆత్మకథ రాశారు. అందులో చిన్ననాట తనకు చదువు చెప్పిన గురువులను ఇలా గుర్తు చేసుకున్నారు.



స్వాతంత్ర్యోద్యమంలోకి నడిపిన గురువు

"ధనోజివారిపల్లె మావూరు. ఆ కాలంలో ప్రాథమిక పాఠశాల కూడా మావూర్లో లేదు. పాకాల బడిలో చేరాను. పాకాల మావూరికి అయిదు మైళ్లు. రానూపోనూ పదిమైళ్ల నడక. మా హైస్కూల్లో రంగస్వామి అయ్యంగార్ అని ఒక ఉపాధ్యాయుడు వుండేవారు. తిరుచానూరు నివాసి. రైల్లో రోజూ పాకాలకి వచ్చేవారు. ఒకరోజు రైలు ఆలస్యం మూలాన 5నిమిషాలు లేటుగా వచ్చారు. అంతే.ఆ రోజు సెలవు పెట్టి సాయంకాలం దాకా అక్కడే ఉన్నారు. పాఠశాల వదిలాక ఆరోజు మాకు చెప్పవలసిన పాఠం చెప్పారు. క్రమశిక్షణలో ఆయన అంతటి ఘనాపాటి! ఒకసారి నేను జబ్బుపడి వరసగా మూడురోజులు పాఠశాలకు వెళ్లలేదు. అప్పుడు రంగస్వామి అయ్యంగార్ 5 మైళ్లు పాకాల నుంచీ నడుచుకుంటూ వచ్చి నన్ను చూసి పళ్లూ ఫలాలూ ఇచ్చి మళ్లీ నడుచుకుంటూ మా వూర్నించి పాకాల వెళ్లి అక్కడ రైలెక్కారు తిరుపతికి. అంతటి ఆప్యాయత వారికి విద్యార్థులంటే!

1943లో గాంధీ బొంబాయి నుంచి రేణిగుంట మీదుగా మద్రాసుకు ప్రయాణిస్తున్నారని తెలిసింది. రంగస్వామి అయ్యంగార్‌తో కలసి 30 మంది విద్యార్థులం రేణిగుంటకు వెళ్లాము. గాంధీని దర్శించిన మొదటి సందర్భం అది. క్విట్ ఇండియా, సహాయ నిరాకరణోద్యమాల్లో 8,9 తరగతుల్లో వుండగా నేను చురుగ్గా పాల్గొన్నాను. అది చూసి రంగస్వామి అయ్యంగార్ మా పాఠశాల విద్యార్థులతో 'పాకాల కాంగ్రెస్ స్టూడెంట్స్ అసోసియేషన్' అని స్థాపించి నన్ను అధ్యక్షుడిని చేశారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న నన్ను 6 మాసాలు చిత్తూరు జైలులో వుంచారు. అయినా ఏనాడూ పరీక్ష తప్పింది లేదు.

ఆ కాలంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్పు వసతి లేదు. హెడ్‌మాస్టర్ ఆర్.టి. రంగారెడ్డి, చెంగారెడ్డి, రంగస్వామి అయ్యంగారు ఇత్యాది టీచర్లంతా కూడా స్తోమత లేని పిల్లలకు పరీక్ష ఫీజులు కట్టి మరీ పరీక్షలు రాయించేవారు.అట్టి నిబద్ధత ఆనాటి ఉపాధ్యాయులది.



విజిలెన్సు ఎస్పీగా కరీముల్లా షరీఫ్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 4: తిరుపతి విజిలెన్సు ఎస్పీగా విజయవాడలో పనిచేస్తున్న కరీముల్లా షరీఫ్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన తిరుపతిలో ఇన్‌చార్జి ఎస్పీగా పనిచేస్తున్నారు. 2010 బ్యాచ్‌కు చెందిన కరీముల్లా షరీఫ్ అనంతపురం జిల్లా కదిరి డీఎస్పీగా పని చేశాక గ్రేహౌండ్స్‌కు బదిలీ అయ్యారు.తర్వాత కడప జిల్లా మైదుకూరు,అనంతపురం జిల్లా పెనుకొండల్లో డీఎస్పీగా పనిచేసిన ఆయన సీఐడీకి బదిలీ అయ్యారు.2018లో అదనపు ఎస్పీగా పదోన్నతి కల్పించిన ప్రభుత్వం ఇంటెలిజెన్సు విభాగానికి బదిలీ చేసింది. అనంతరం పశ్చిమ గోదావరి సెబ్ అదనపు ఎస్పీగా నియమించింది. తరువాత విజయవాడ ఇంటెలిజెన్సు విభాగానికి బదిలీ చేసారు. 2023లో ఎస్పీగా పదోన్నతిపై విజయవాడలోని విజిలెన్సు విభాగంలో ఎనిమిది నెలలు పనిచేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీటీడీలోని వివిధ విభాగాల్లో జరిగిన అవినీతి అక్రమాలను వెలికి తీసేందుకు ఆయన్ను విచారణాధికారిగా నియమించింది. ఈ క్రమంలో ప్రస్తుతం తిరుపతి విజిలెన్సు విభాగానికి ఇన్‌చార్జి ఎస్పీగా పనిచేస్తున్నారు. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన విజిలెన్సు ఎస్పీల బదిలీల్లో కరీముల్లా షరీఫ్‌ను తిరుపతి ఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతిలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు.

71మంది టీచర్లకు నేడు పురస్కారాలు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 4: జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసిన 71మందికి గురుపూజోత్సవ సందర్భంగా నేడు పురస్కారాలను అందజేయనున్నట్లు డీఈవో శేఖర్ తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు తడ, చిల్లకూరు, ఏర్పేడు మండలాలనుంచి ఎవరూ దరఖాస్తు చేసుకోలేదని, మిగిలిన 31 మండలాలనుంచి 88మంది దరఖాస్తు చేసుకోగా 71 మంది ఎంపికయ్యారని వివరించారు. వారి వివరాలు మండలాలవారీగా... ఎ. చెన్నమ్మ (ఎస్జీటీ, అక్కసముద్రం, బాలాయపల్లి మండలం), ఎం. లక్ష్మయ్య, పి. దేవేంద్ర (స్కూల్ అసిస్టెంట్లు, కలివెట్టు, బీఎన్ కండ్రిగ మండలం), పి. విజయ (ఎస్జీటీ, పద్మావతిపురం, బీఎన్ కండ్రిగ), బి. రామ్మూర్తి (హెచ్‌ఎం, నరసింగాపురం, చంద్రగిరి), డాక్టర్. ఎ. భారతమ్మ (స్కూల్ అసిస్టెంట్, ఎ.రంగంపేట, చంద్రగిరి), బి. లావణ్యలత (స్కూల్ అసిస్టెంట్, బాలికల ఉన్నతపాఠశాల, చంద్రగిరి), బి. మల్లీశ్వరి (ఎస్జీటీ, మొండికాల్వ, చంద్రగిరి), పి. శ్రీనివాసులు (స్కూల్ అసిస్టెంట్, చిల్లకూరు), జి. తారకనాథ్ (ఎస్జీటీ, చినిగేపల్లి, చిన్నగొట్టిగల్లు), టి. జ్యోతి (ఎస్జీటీ, నాగపోలు, డక్కిలి), వి. శ్రీనివాసులు (ఎస్జీటీ, తల్లంపాడు, దొరవారిసత్రం), కె. శివకళ (ఎస్జీటీ, అయ్యవారిపాళెం, గూడూరు), మోహన్‌బాబు (హెచ్‌ఎం, రాగిగుంట, కేవీబీ పురం), ఎల్. మంజుల (ఎస్జీటీ, తిమ్మనాయుడుపాళెం, కోట), ఎ. వెంకటేశ్వర్లు (పీఎస్ హెచ్‌ఎం, వెంబాకం, నాగలాపురం), మధుసూదన్ (హెచ్‌ఎం, అన్నమేడు, నాయుడుపేట), ఎండీ షఫీవుల్లా (స్కూల్ అసిస్టెంట్, అన్నమేడు, నాయుడుపేట), కె. సుబ్బారావు (పీజీటీ, నాయుడుపేట), జి. శంకరయ్య(ఎస్జీటీ, అత్తిపాళెం, నాయుడుపేట), ఎ. శంకరయ్య (ఎస్జీటీ, మర్లపల్లి, నాయుడుపేట), కె. బాలకృష్ణారెడ్డి (స్కూల్ అసిస్టెంట్, పాలమంగళం, నారాయణవనం), బి. వల్లి (ఎస్‌ఏ, అరణ్యకండ్రిగ, నారాయణవనం), కేవీ శ్యామలత (ఎస్‌ఏ, నారాయణవనం), ఎన్. రమేష్ (ఎస్జీటీ, కొండలచెరువు, నారాయణవనం), జె. శ్రీనివాసులు (ఎస్‌ఏ, చిల్లమానుచేను, ఓజిలి), కె. శ్రీరంజని (ఎస్జీటీ, ఇరంగారిపల్లి, పాకాల), పి. రుత్‌పావని (ఎస్జీటీ, నేలదానిపల్లె, పాకాల), డి. బాలసుబ్రహ్మణ్యం (ఎస్జీటీ, పాకాల), జె. దోరతి వయోల (ఎస్జీటీ, కానూరు రాజుపాళెం, పెళ్లకూరు), వి. బాలసుబ్రహ్మణ్యం (ఎస్జీటీ, ఎడపూడి, పెళ్లకూరు), వి. గిరిప్రకాష్ (హెచ్‌ఎం, పిచ్చాటూరు), ఎం. రమేష్ బాబు (ఎస్‌ఏ, పిచ్చాటూరు), ఎం. మదనమునసయర్ (ఎస్జీటీ, పిచ్చాటూరు), పీఎస్. సుబ్బరాయన్ (హెచ్‌ఎం, గోపాలకృష్ణాపురం, పుత్తూరు), భువనేశ్వరి (హెచ్‌ఎం, పుత్తూరు), ఎం. గోపి (ఎస్‌ఏ, జీకే పురం, పుత్తూరు), బి. హరినాథ్ (ఎస్‌ఏ, ఎగువకనకంపాళెం, పుత్తూరు), ఎ. గోపీకృష్ణ (ఎస్‌ఏ, గొల్లపల్లి, పుత్తూరు), ఎ. కేశవులు (ఎస్జీటీ, బొజ్జనాతం, పుత్తూరు), సి. రమేష్‌యాదవ్ (ఎస్‌ఏ, పరమాల, ఆర్సీ పురం), ఇ. స్వయంప్రభ (ఎస్‌ఏ, కమ్మకండ్రిగ, ఆర్సీ పురం), పి. సుగుణ (ఎస్జీటీ, ఎస్‌ఆర్ కమ్మపల్లి, ఆర్సీపురం), జె. లక్ష్మీదేవసేన (పీఎస్‌హెచ్‌ఎం, ఇంద్రానగర్, రేణిగుంట), ఎస్‌కే బావాజాన్ (ఎస్‌ఏ, తారకారామానగర్, రేణిగుంట), ప్రేమ్‌కుమార్ (ఎస్‌ఏ, పుదుకుప్పం, సత్యవేడు), జి.కృష్ణయ్య (హెచ్‌ఎం, తొండమనాడు, శ్రీకాళహస్తి), పి. మాధవీలత (పీజీటీ, అంబేడ్కర్ గురుకులం, కాసా గార్డెన్స్, శ్రీకాళహస్తి), డి. నరసింహయ్య (ఎస్‌ఏ, ముచ్చివోలు, శ్రీకాళహస్తి), జీపీ చలం (ఎస్‌ఏ, వేడాం, శ్రీకాళహస్తి), ఎం. చంద్రజిత్ యాదవ్ (హెచ్‌ఎం, కోటాపోలూరు, సూళ్లూరుపేట), కె. మునీశ్వర్‌రెడ్డి (ఎస్‌ఏ, గుండేలిగుంట, తొట్టంబేడు), ఎస్. మురళీమోహన్ ప్రసాద్ (ఎస్‌ఏ, ఎస్‌ఎన్ పురం, తిరుపతి అర్బన్) మురళీకృష్ణయ్య (ఎస్జీటీ, ఎస్వీయూ క్యాంపస్, తిరుపతి), జి. దేవరాజులు నాయుడు (ఎస్జీటీ, గాంధీనగర్, తిరుపతి), డి. నిర్మల (ఎస్జీటీ, సత్యనారాయణపురం, తిరుపతి), డి.ప్రశాంతి (ఎస్‌ఏ, తిరుచానూరు), కె.నాగేశ్వరయ్య (ఎస్‌ఏ, దుర్గసముద్రం, తిరుపతి రూరల్), కె. జానకిరామ మండాడి (ఎస్‌ఏ, మల్లంగుంట, తిరుపతి రూరల్), బి. నాగమల్లేశ్వరి (పీఈటీ, పెరుమాళ్లపల్లి, తిరుపతి రూరల్), ఎం. రవిశేఖర్‌రెడ్డి (హెచ్‌ఎం, తడుకు, వడమాలపేట), ఎస్. మధుసూదనరాజు (పీఎస్‌హెచ్‌ఎం,పాపానాయుడుపేట,ఏర్పేడు), డి. మాల్యాద్రి (ఎస్జీటీ, దుగరాజపట్నం, వాకాడు), ఐ. మాలిని (ఎస్జీటీ, వెంకటరెడ్డిపాళెం, వాకాడు), మాధవయ్య (హెచ్‌ఎం, సంతవేలూరు, వరదయ్యపాళెం), బి. మురళీకృష్ణ (ఎస్‌ఏ, బత్తలవల్లం, వరదయ్యపాళెం), బి. సత్యనారాయణ (ఎస్జీటీ, పారవోలు, వెంకటగిరి), ఆర్. సాయిరాం (ఎస్జీటీ, మొగళ్లగుంట, వెంకటగిరి), సి. అమరనాథ్ (ఎస్‌ఏ, ఎర్రావారిపాళెం), పి. రాజగోపాల్ (ఎస్జీటీ, బిజ్జేపల్లి, ఎర్రావారిపాళెం).

మెడికల్ షాపు యజమానిపై అత్యాచారం కేసు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబర్ 4 : ఓ మెడికల్ షాపు యజమాని అత్యాచారానికి పాల్పడిన ఘటన బుధవారం వెలుగు చూసింది. సీఐ చిన్నగోవిందు కథనం మేరకు...తిరుపతి రూరల్ మండలంలో కుప్పుస్వామి హిమ మెడికల్ షాపు నడుపుతున్నాడు. ఆస్మాతో బాధపడుతోన్న ఓ కార్మికుడి కుమార్తె (10) బుధవారం సాయంత్రం మెడికల్ షాపులో నెబులైజర్ పెట్టుకుని మందులు తీసుకువెళ్లేందుకు వచ్చింది.వైద్యం పేరుతో ఆమెను లోపలికి పిలిచిన కుప్పుస్వామి మాయ మాటలతో నమ్మించి అత్యాచారానికి పాల్పడ్డాడు. భయపడిపోయిన ఆ బాలిక జరిగిన విషయాన్ని తన తండ్రికి తెలియజేసింది.ఆగ్రహంతో మెడికల్ షాపు వద్దకు చేరుకున్న బాలిక తల్లిదండ్రులు, బంధువులు అతడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు ముద్దాయిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ చిన్నగోవిందు చెప్పారు.

సీఐల బదిలీ


తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 4: నలుగురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు.చంద్రగిరిలో పనిచేస్తున్న రామయ్యను ఎస్వీయూనివర్శిటీకి, ఇక్కడ పనిచేస్తున్న మురళీమోహన్‌ను తిరుమల టూటౌన్‌కు బదిలీ చేశారు.తిరుమల టూటౌన్‌లో పనిచేస్తున్న సత్యనారాయణను వీఆర్‌కు పంపారు. ఎన్నికల ముందు వీఆర్‌కు పంపిన అబ్బన్నను తిరుపతి క్రైం పోలీస్టేషన్ సీఐగా నియమించారు. వీరందరూ రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనుండగా చంద్రగిరి సీఐగా సుబ్బరామిరెడ్డి బుధవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు.

7న స్విమ్స్‌లో ఓపీ, ఓటీలకు సెలవు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 4: వినాయక చవితి పండుగ సందర్భంగా ఈ నెల 7న స్విమ్స్ ఓపీ, ఓటీలకు సెలవు ప్రకటిస్తున్నట్లు డైరెక్టర్ ఆర్వీకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం అత్యవసర వైద్య సేవలు మాత్రమే అందుబాటులో వుంటాయని, ఈ విషయంలో అందరూ సహకరించాలని ఆయన కోరారు.

అనుమతి కోసం హాయ్ చెప్పండి

● చవితి వేడుకలకు సింగిల్ విండో క్లియరెన్స్ విధానం



ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన వెబ్ సైట్ పోర్టల్

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 4: వినాయక చవితి వేడుకల్లో భాగంగా విగ్రహాలు ప్రతిష్ఠించే మండపాలకు ఆన్‌లైన్‌లోనే అనుమతులు ఇచ్చేలా ప్రభుత్వం సింగిల్ విండో క్లియరెన్స్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. గతంలో వేడుకలు నిర్వహించాలంటే అగ్నిమాపక, విద్యుత్తు, పురపాలక , పోలీసు శాఖల నుంచి అధికారుల అనుమతి తీసుకోవాల్సి వచ్చేది. వీటి కోసం అధికారుల చుట్టూ చవితి వేడుకల నిర్వాహకులు రోజుల తరబడి ప్రదక్షిణ చేసే వారు. కానీ ఈ ఏడాది ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విధానంతో ఇంటి నుంచే అనుమతులను పొందే అవకాశం ఉంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన నంబర్‌కు హాయ్ అని మెసేజ్ చేయడం లేదా దానికి సంబంధించిన వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేయడం వలన ఇట్టే వినాయక విగ్రహ ఏర్పాటుకు అనుమతులు పొందే వెసులుబాటును ప్రభుత్వం తీసుకువచ్చింది.

● చవితి వేడుకలు నిర్వహించే వారు కచ్చితంగా ఉత్సవ కమిటీని నియమించుకోవాలి. వారిలో ఒకరి సెల్‌ఫోన్ నుంచి 79950 95880 నంబరుకు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ పంపించాలి. వెంటనే సదరు నంబరుకు లింక్ వస్తుంది. దాన్ని అనుసరించాలి. లేకుంటే నేరుగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.గణేష్‌ఉత్సవ్.నెట్ అనే వెబ్‌సైట్‌లో అడిగిన పూర్తి వివరాలను నమోదు చేయడంతో అందులో ఇచ్చిన మన సెల్ నంబరుకు ఒక ఓటీపీ వస్తుంది. ఓటీపీ నమోదు చేసిన వెంటనే గూగుల్లో దరఖాస్తు వస్తుంది. అందులో అడిగిన వివరాలను పూరించాల్సి ఉంటుంది. దానిని పోలీసులు, ఇతర శాఖల అధికారులు పరిశీలించి అనుమతి మంజూరు చేస్తారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వెంటనే సంబంధిత బాధ్యుడి పేరుతో క్యూఆర్ కోడ్ వస్తుంది. ఆ క్యూఆర్ కోడ్ డౌన్‌లోడ్ చేసి విగ్రహం ఏర్పాటు చేసే మండపం వద్ద అంటించాల్సి ఉంటుంది. ఈ కోడ్‌ను స్కాన్ చేస్తే విగ్రహానికి సంబంధించిన వివరాలన్నీ వెల్లడవుతాయి.

బర్డ్‌పై టీటీడీ దృష్టి

● సందర్శించిన ఈవో, జేఈవోలు
● అంతా బాగుందంటూ వైద్యుల వివరణ
● మరి మీడియాలో కథనాలేంటన్న ఈవో



చిన్నారి పేషెంట్ తల్లితో మాట్లాడుతున్న టీటీడీ ఈవో శ్యామలరావు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుపతి, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): బాలాజీ వికలాంగుల శస్త్రచికిత్స, పరిశోధన, పునరావాస కేంద్రం (బర్డ్)పై టీటీడీ అధికారులు దృష్టి పెట్టారు. బుధవారం టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో గౌతమి, మరో జేఈవో, బర్డ్ ఇంచార్జి డైరెక్టర్ వీరబ్రహ్మం బర్డ్ ఆస్పత్రిని సందర్శించారు. అక్కడి వైద్యులతో సమీక్షించారు. అయితే 'బర్డ్‌లో అంతా బాగా జరుగుతోంది' అని వైద్యులు ఈవోను పక్కదారి పట్టించే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. దీంతో ఈవో స్పందిస్తూ ' అంతా బాగుంటే మీడియాలో వారానికో కథనం ఎందుకు వస్తోంది' అని ప్రశ్నించినట్లు సమాచారం. గడిచిన ఐదేళ్లలో బర్డ్ ఆస్పత్రి పాలన పక్కదారిపట్టిందని బుధవారం ఆంధ్రజ్యోతిలో 'గతి తప్పిన బర్డ్' శీర్షికన కథనం ప్రచురితమైంది. అదేవిధంగా రెండు వారాల క్రితం బర్డ్‌లో అవినీతి, అక్రమాలపై వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ విచారణ జరుగుతోందన్న నేపథ్యంలో 'బర్డ్‌ను భ్రష్టుపట్టించారు' అని మరో కథనాన్ని కూడా ఆంధ్రజ్యోతి ప్రచురించింది. ఈ నేపథ్యంలో టీటీడీ ఈవో, జేఈవోలు బర్డ్‌ను పరిశీలించారు. పత్రికలో వచ్చిన ప్రతి అంశంపై వైద్యులు వివరణ రాసి ఈవోకు అందించినట్లు తెలుస్తోంది. వీటిపై తర్వాత విచారణ చేస్తానని ఈవో చెప్పినట్లు తెలుస్తోంది. బర్డ్ ఆస్పత్రిలో రోగులు, వారి సహాయకులకు అందుతున్న సదుపాయాలను, వైద్య సేవలను అడిగి ఈవో తెలుసుకున్నారు. అనంతరం అత్యవసర వార్డు, జనరల్ వార్డు, ఎక్సరే, స్కానింగ్, ఓపీ వార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, అన్నప్రసాదాల నాణ్యత గురించి రోగులతో మాట్లాడి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

● **ఆపరేషన్లు తగ్గలేదు : టీటీడీ**

బర్డ్‌లో కార్పొరేట్ ఆస్పత్రుల స్థాయిలో వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు టీటీడీ సీపీఆర్వో రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన 'గతి తప్పిన బర్డ్' కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. రోగులకు ఓపీ, ఆపరేషన్లు, కృత్రిమ అవయవాల అమరిక వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గత మూడు నెలల్లో 24,429 ఓపీ సేవలు, 1489 ఆర్థోపెడిక్ సేవలు అందించారని, 24 గంటలూ వైద్యులు అందుబాటులో ఉంటున్నారని వెల్లడించారు. కాగా గాయానికి కట్టు మార్చడం, కట్టు కట్టడాలు కూడా ఆపరేషన్ల కిందే చూపించి, ఈవోకు తప్పుడు సమాచారం ఇచ్చారన్న చర్చ వినిపిస్తోంది. అదేవిధంగా విజిలెన్స్ విచారణ పైన, సిబ్బంది నిర్లక్ష్యంపైన, మెడికల్ షాపు మూతపైన ఎలాంటి వివరణ ఇవ్వకపోవడం గమనార్హం.



వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.15కోట్లు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 4: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1.15,81,533 వచ్చింది. ఆస్థాన మండపంలో ఈవో గురుప్రసాద్ పర్యవేక్షణలో స్వామి హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. 49 గ్రాముల బంగారు, 1.30 కేజీల వెండి, 602 యూఎస్‌ఏ, 20 ఆస్ట్రేలియా, 2 సింగపూర్ డాలర్లు లభించాయి. గో సంరక్షణ హుండీ ద్వారా రూ.7,940, నిత్యాన్నదాన సత్రం వద్ద ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.24,025 సమకూరాయి. ఈ ఆదాయం పూర్తిగా 18 రోజులలో లభించింది.

రేపు జడ్పీ సమావేశం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 4: జిల్లా పరిషత్ సర్వసభ సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో గ్లోరియా ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్, ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, జడ్పీటీసీలు పాల్గొనే ఈ సమావేశానికి జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.53 కోట్లు

తిరుమల, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.53 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఆ వివరాలను టీటీడీ బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 57,817 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. 17,592 మంది తలనీలాలు సమర్పించారు.

తిరుమలలో రేపు డయల్ యువర్ ఈవో

తిరుమల, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం జరుగనుంది. అన్నమయ్య భవనంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 2.50 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. భక్తులు తమ సందేహాలు, సూచనలు, ఫిర్యాదులపై టీటీడీ ఈవో శ్యామలరావుతో నేరుగా మాట్లాడవచ్చు.ఇందుకోసం0877 2263261 నంబరుకు ఫోన్ చేయాల్సి ఉంటుంది.

శ్రీవారి సేవలో హీరో కిరణ్ అబ్బవరం



తిరుమల, సెప్టెంబరు4(ఆంధ్ర జ్యోతి): సినీహీరో కిరణ్ అబ్బవరం దంపతులు బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఇటీవల కిరణ్, రహస్యల వివాహం జరిగిన విషయం తెలిసిందే. ఈక్రమంలో శ్రీవారి ఆశీస్సుల కోసం ఈనూతన దపంతులు బుధవారం తిరుమలకు చేరుకుని ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లారు.ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. ఆలయం ముందు హీరో కిరణ్ అబ్బవరం దంపతులను చూసేందుకు సినీ అభిమానులు ఆశక్తి చూపారు. కిరణ్ 'ఎస్ఆర్ కల్యాణమండపం', 'రాజావారు రాణివారు', 'రూల్స్ రంజన్' వంటి సినిమాల్లో నటించి మంచి పేరు పొందిన విషయం తెలిసిందే.

వేద విజ్ఞానపీఠం సందర్శన



వేదవిజ్ఞాన పీఠంలో పరిసరాల పరిశుభ్రతను పరిశీలిస్తున్న వెంకయ్య చౌదరి

తిరుమల, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠాన్ని బుధవారం సాయంత్రం టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి పరిశీలించారు. వేద విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. టీటీడీ కల్పిస్తున్న వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు, మరుగుదొడ్లు, వంటశాల, భోజనశాలను చూశారు. సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

కంకర టిప్పర్ వెళ్తే కళ్లు మూసుకోవాల్సిందే..



కంకరపై పట్ట లేకుండా వెళుతున్న టిప్పర్

రామచంద్రాపురం, సెప్టెంబరు 4: తిరుపతి-పచ్చికాపల్లం ప్రధాన రహదారిలో కంకర్ల టిప్పర్లు దుమ్ము రేపుతూ అతివేగంగా వెళ్తున్నాయి. దీంతో వాటి వెనుక వెళ్లే వాహన చోదకుల కళ్లల్లో దుమ్ము పడి ఇబ్బంది పడుతున్నారు. నిత్యం పచ్చికాపల్లం నుంచి తిరుపతి వరకు సుమారు 50టిప్పర్లలో పైగా కంకర రవాణా చేస్తున్నారు. ఏమీ కప్పకుండా కంకర తరలిస్తున్నారు. ఫలితంగా వాహనచోదకులు నానా అవస్థలు పడుతున్నారు. ఐదేళ్లల్లో టిప్పర్ల అతివేగానికి ఏడుగురు మరణించారు. టిప్పర్ల వేగాన్ని నియంత్రించి కంకరపై పట్ట వేసి తరలించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక



సుగుణ, రమేష్‌యాదవ్, తారకనాథ్

రామచంద్రాపురం, సెప్టెంబరు 4: మండలంలోని ఎన్ఆర్ కమ్మపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సుగుణ, పరమాల ఉన్నత పాఠశాల హిందీ టీచర్ రమేష్‌యాదవ్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. ఎంఈవో మార్కొండయ్యనాయుడు బుధవారం ఈ విషయం తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టర్ వీరికి ఉత్తమ అవార్డు, ప్రశంసాపత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం చినిగేపల్లె ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు తారకనాథ్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయనను ఎంఈవో, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాకాల, సెప్టెంబర్ 4: మండలంలో గురువారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ నరేంద్ర తెలిపారు. 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతేల కారణంగా సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

దళిత కుటుంబానికి న్యాయం చేయాలి



తహసీల్దారు కార్యాలయం వద్ద ఎంఆర్‌పీఎస్ నాయకులు

భాకరాపేట, సెప్టెంబరు 4: చిన్నగొట్టిగల్లు మండలం ఎగవూరు పంచాయతీ ముడుపుగుండ్ల మాదిగపల్లెకు చెందిన ఎర్రయ్య కుటుంబానికి న్యాయం చేయాలని ఎంఆర్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి వరదరాజులు కోరారు. బుధవారం ఆయన తహసీల్దారు జనార్దనరాజుకు ఈమేరకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వరదరాజులు మాట్లాడుతూ ఎర్రయ్యకు చెందిన సర్వే.నెం.7/3లో 1.70 ఎకరాల భూమికి పక్కన వేరే గ్రామానికి చెందిన రైతు భూమి ఉందన్నారు. సదరు రైతు ఆ భూమిలో తనకు కొంత రావాలంటూ ఎర్రయ్యను సాగు చేయనివ్వడం లేదన్నారు. భూమి సర్వే చేసి హద్దురాళ్లను చూపించాలని కోరారు. వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దారు హామీ ఇచ్చారన్నారు. ఆయన వెంట ఎంఆర్‌పీఎస్ నాయకులు ఆదినారాయణ, రాంబాబు, నాగరాజు, గురుశంకరప్రసాద్, నాగులయ్య, సిద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి సీఐ బాధ్యతల స్వీకరణ



సుబ్బరామిరెడ్డి

చంద్రగిరి, సెప్టెంబరు 4: సీఐగా సుబ్బరామిరెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. నగిరి రూరల్ సీఐగా పనిచేసిన ఆయన బదిలీపై చంద్రగిరికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న రామయ్య తిరుపతి ఎస్వీ యూనివర్శిటీకి బదిలీ అయ్యారు. సీఐ సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. గంజాయి నిర్మూలన ధ్యేయంగా పని చేస్తానన్నారు. ఎస్ఐలు అనిత, రవీంద్రనాయక్‌లకు సీఐకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన



చంద్రగిరి, సెప్టెంబరు 4: దోర్నకంబాల పంచాయతీలో కూరగాయల తోటలపై ఉద్యానశాఖ అధికారి శైలజ బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాల కారణంగా కూరగాయల తోటల్లో ఆకులపై మచ్చలు, తెగుళ్ళు సోకే అవకాశం ఉందన్నారు. తమశాఖ సిబ్బంది సూచనల మేరకు రైతులు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. కూరగాయలు, పూల తోటలపై మరిన్ని మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.





మంగళం-తిరుచానూరు రైల్వేస్టేషన్ అనుసంధాన రహదారి

ఆగిన రహదారి నిర్మాణంతో అవస్థలు

● విజిలెన్స్ విచారణతో టీటీడీ రహదారికి బ్రేక్

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 4: శ్రీవారి భక్తులు, స్థానికుల సౌకర్యార్థం టీటీడీ చేపట్టిన మంగళం-తిరుచానూరు రైల్వేస్టేషన్ రహదారి పనులు అర్థంతరంగా ఆగిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ నిధులు పక్కదారి పట్టాయని ప్రజాప్రతినిధులు చేసిన ఫిర్యాదుతో కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ విషయమై కొన్ని రోజులుగా టీటీడీ ఇంజినీరింగ్ విభాగంలో విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది. దీంతో టీటీడీ ఇంజినీరింగ్ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఇందులో భాగంగా మంగళం-తిరుచానూరు రైల్వేస్టేషన్ రహదారి పనులు కూడా ముందుకు సాగడం లేదు. ఆ దారిలో తరచూ రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ రోడ్డు ఎప్పుడు పూర్తిచేస్తారా అంటూ ఎదురుచూస్తున్నారు.

రూ. 18కోట్లతో అనుసంధానం రోడ్డు

తిరుపతి రైల్వేస్టేషన్‌కు ప్రయాణికుల తాకిడిని తగ్గించడం, అక్కడి నుంచి అలిపిరి చేరుకునే క్రమంలో ట్రాఫిక్ సమస్యలను అధిగమించడం, శ్రీవారి భక్తులను సులభంగా తిరుమల చేరుకునేలా రేణిగుంట రోడ్డు నుంచి కరకంబాడి రోడ్డుకు అనుసంధానం కోసం టీటీడీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రూ.18కోట్లతో మంగళం నుంచి తిరుచానూరు రైల్వేస్టేషన్ వరకు రెండు కిలోమీటర్ల పొడవు, 80అడుగుల వెడల్పుతో డబుల్‌లైన్ రోడ్డును, డివైడర్‌లో ఉద్యానవనం, లైటింగ్ వంటి అధునాతన ఏర్పాట్లతో నిర్మించతలపెట్టింది. గత ఏడాది చివర్లో ప్రారంభమైన పనులు చురుగ్గా సాగాయి. దాదాపు 50శాతం పనులు పూర్తయ్యాయి. అనివార్య కారణాలతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోవడంతో ఆ రోడ్డు గందరగోళంగా మారింది. వర్షాలకు గుంతలు తేలడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ అదుపుతప్పి బోల్తాపడిపోతున్నారు. త్వరగా పూర్తి చేస్తే అటు భక్తులకు, ఇటు స్థానికులకు ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు కోరుతున్నారు.

మంచి పౌరుల కొరత తీర్చేది ఉపాధ్యాయులే

● గల్లా రామచంద్ర నాయుడు



తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 4: ఇపుడు దేశానికి మంచి పౌరుల కొరత తీవ్రంగా ఉందని, ఆ సమస్యకు పరిష్కారం ఉపాధ్యాయుల చేతిలోనే ఉందని ప్రముఖ పారిశ్రామిక వేత్త గల్లా రామచంద్ర నాయుడు అన్నారు.ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం స్థానిక ఎస్వీ నగర్‌లోని తన గురువు ఆచార్య కె.వెంకటరెడ్డిని సత్కరించిన తరువాత ఆయన మాట్లాడుతూ... ఆనాడు వెంకటరెడ్డి వంటి గొప్ప గురువులు ఉన్నందునే యువతలో నైపుణ్యాలు మెరుగుపడ్డాయని చెప్పారు. వారంతా దేశ నిర్మాణంలో పాలుపంచుకుంటున్నారని తెలిపారు. వెంకటరెడ్డి ఉపాధ్యాయ లోకానికి మార్గదర్శకుడని గుర్తుచేశారు. మాజీ మంత్రి, రచయిత్రి గల్లా అరుణకుమారి మాట్లాడుతూ... వెంకటరెడ్డి తన 93వ యేట ఇటీవలే స్వీయచరిత్ర ప్రచురించారని, వారు విద్యారంగానికి స్ఫూర్తిప్రదాతగా నిలిచారని చెప్పారు. వారి రచనలో ఉపాధ్యాయవృత్తి ఔన్నత్యాన్ని చాటి చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరెడ్డి కుటుంబసభ్యులు హేమలత, విజయ, సుమలత, రచయితలు సాకం నాగరాజ, వాకా ప్రసాద్, విద్యావేత్త జయరామిరెడ్డి, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మఠం భూముల్లో అక్రమ నిర్మాణాల తొలగింపునకు ఉత్తర్వులు



ధర్నా చేస్తున్న శివానాయక్,అనుచరులు

తిరుపతి రూరల్, సెప్టెంబరు 4: తిరుపతి గ్రామీణ మండలం అవిలాల లెక్కదాఖలు వేదాంతపురం పంచాయతీలోని సర్వేనెంబరు 364, 368/1లోని హథీరాంజీ మఠం భూముల్లో శివానాయక్ అనే వ్యక్తి చేపడుతున్న అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్నట్లు మఠం ఇంచార్జ్ పరిపాలనాధికారి కె.ఎస్.రామారావు బుధవారం ఉత్తర్వుల జారీ చేశారు. ఇందుకు సంబంధించి సర్వేయర్‌ను ఏర్పాటు చేయాలని ల్యాండ్ ప్రొటక్షన్‌సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్, ఎస్పీలకు ఈ విషయాన్ని నివేదించారు. విషయం తెలుసుకున్న శివానాయక్ బుధవారం రాత్రి తన అనుచరులతో తిరుపతి మఠం చేరుకుని ప్రాంగణంలో ధర్నా చేశారు. నిర్మాణాలను కూల్చేందుకు సన్నద్ధమవడం అన్యాయమని, ఆ చర్యలు మానుకోవాలని వారు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శివానాయక్ మాట్లాడుతూ హథీరాంబావాజీకి వేల ఎకరాలు భూమి ఉన్నా ఆలయం నిర్మించలేదన్నారు. బంజారా ప్రజల కోరిక మేరకు ఆలయ నిర్మాణానికి వేదాంతపురంలోని భూమిని కేటాయించారని గుర్తు చేశారు. ఆ స్థలంలో ఆలయాలతో పాటు కాటేజీలు నిర్మిస్తున్నామని తెలియజేశారు.

సంస్కృతభాష వ్యాప్తికి విశేష కృషి

● ఎన్ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి



సంస్కృతవర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి

తిరుపతి రూరల్, సెప్టెంబరు 4: సంస్కృత భాషను జనబాహుళ్యంలోకి తీసుకెళ్లేందుకు తిరుపతి జాతీయ సంస్కృత వర్సిటీ విశేషంగా కృషి చేస్తోందని వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. యూజీసీ, విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం న్యూఢిల్లీలో నిర్వహించిన వర్సిటీ సంస్థాగత అభివృద్ధి-ప్రణాళిక సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సదస్సుకు కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్రప్రధాన్ హాజరయ్యారు.విశ్వవిద్యాలయాల అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలను ఆయన వివరించారని వీసీ పేర్కొన్నారు. తిరుపతిలోని జాతీయ సంస్కృతవర్సిటీలో సంస్కృత భాషాభివృద్ధికి చేస్తున్న కృషి, పురోగతి అంశాలను వివరించామని ఒక ప్రకటనలో తెలిపారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా



మంగళం, సెప్టెంబరు 4: తిరుపతి అటవీశాఖ కార్యాలయం ముందు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కార్తీక్, ఉపాధ్యక్షుడు మోహన్, కార్యదర్శి సాయికిరణ్ మాట్లాడుతూ ఐదు నెలలుగా తమకు జీతాలు రాక కుటుంబ పోషణ ఇబ్బందికరంగా మారిందన్నారు. గత నెల 12వ తేదీ లోపు జీతాలు ఇప్పిస్తామని జిల్లా అటవీశాఖ అధికారి సతీష్‌రెడ్డి హామీ ఇచ్చి మరిచారన్నారు. ఇవుడు వినాయకచవితిలోపు మూడు నెలల జీతం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ విషయంపై సీసీఎఫ్ నాగేశ్వరరావును కలవగా, ఇంతవరకు తన దృష్టికి రాలేదన్నారు. త్వరలోనే జీతాలు ఇచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పండుగ రోజుకైనా జీతాలు ఇప్పించాలని వారు కోరారు. అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ లీడర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మరింత రుచికరంగా శ్రీవారి లడ్డూ ప్రసాదాలు

నాణ్యమైన ఆవు నెయ్యి కొనుగోలు చేస్తున్నామన్న టీటీడీ ఈవో

తిరుమల, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులకు మరింత రుచికరమైన లడ్డూ ప్రసాదాలు అందించేందుకు నాణ్యమైన ఆవు నెయ్యి కొనుగోలు చేస్తున్నట్టు టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ గోడౌన్ వద్ద బెంగళూరుకు చెందిన కర్ణాటక కో ఆపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ ఫెడరేషన్ లిమిటెడ్(కేఎంఎఫ్) నుంచి కొనుగోలు చేసిన నెయ్యి లారీ తిరుపతి నుంచి తిరుమలకు బుధవారం బయలు దేరింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్య క్రమంలో ఈవో శ్యామలరావు అధికారులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఈవో మీడియాతో మాట్లాడుతూ.. లడ్డూ నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. గతంలో నాణ్యత, రుచి, వాసన లేని ఆవు నెయ్యి సరఫరా చేశారన్నారు.ఇప్పటివరకూ నాణ్యతను పరి శీలించేందుకు సరైన ల్యాబ్ లేదన్నారు.ప్రైవేట్ ల్యాబ్ సౌకర్యం ఉన్నా పరిశీలించలేదన్నారు. అందువల్ల అత్యాధునిక ల్యాబొరేటరీ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో సిబ్బందికి మైసూరులో శిక్షణ ఇస్తున్నామన్నారు. నెయ్యి కొనుగోలుపై నలుగురు డెయిరీ నిపుణులతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఇందులో ఎన్‌డీఆర్‌ఏ విశ్రాంత ఆచార్యులు సురేంద్రనాథ్, హైదరాబాద్‌కు చెందిన విజయభాస్కర రెడ్డి, స్వర్ణలత, బెంగళూరుకు చెందిన మహదేవన్ ఉన్నారన్నారు. నాణ్యమైన నెయ్యి కొనుగోలు టెండర్‌లో ఎలాంటి అంశాలు చేర్చాలో కమిటీ సూచించిందన్నారు. గతంలోని ఐదుగురు సరఫరాదారుల్లో ఒకరు అందించిన నెయ్యిలో నాణ్యతా ప్రమాణాలు సరిపోలడం లేదన్నారు. కల్తీ నెయ్యిని సరఫరా చేస్తున్నట్టు పరీక్షల్లో తేలిందన్నారు. దీంతో టెండర్ షరతులను సవరించినట్టు తెలిపారు. కొత్త షరతుల ప్రకారం డెయిరీలు నెయ్యి మరిగించడానికి ముందు కొన్ని గంటల పాటు ఎంపిక చేసిన స్టార్టర్ కల్చర్‌తో వెన్నను పక్వానికి తీసుకురావాలన్నారు. వెన్నను 120 డిగ్రీల సెంటిగ్రేడ్‌లో 2 నుంచి 5 నిమిషాలు వేడి చేయాలన్నారు. కర్ణాటక నందిని నెయ్యి కొనుగోలుకు ఆమోదం తెలిపామన్నారు. ఈ కంపెనీ నుంచి నేరుగా నెయ్యి కొనుగోలు చేస్తున్నట్టు వివరించారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో గౌతమి, సీవీఎస్వో శ్రీధర్, నందిని డెయిరీ లైజనింగ్ ఆఫీసర్ మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఆలయాలకు లడ్డూల తరలింపు

భారీ వర్షాల నేపథ్యంలో తిరుమలకు భక్తుల సంఖ్య తగ్గిందని ఈవో తెలిపారు. ఈ నేపథ్యంలో భక్తుల విజ్ఞప్తి మేరకు టీటీడీ స్థానిక ఆలయాలు, సమాచార కేంద్రాల్లో కూడా లడ్డూ ప్రసాదాలను విక్రయిస్తున్నామన్నారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయం, కోదండరామస్వామి ఆలయం, శ్రీనివాసమంగాపురంలోని కళ్యాణవెంకటేశ్వరస్వామి ఆలయం, అప్పలాయగుంటలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం, ఒంటిమిట్టలోని కోదండరామస్వామి ఆలయం,కడపలోని దేవుని కడప ఆలయం , హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్, జూబ్లీహిల్స్, అమరావతి, విజయవాడ, రాజమహేంద్రవరం, పిఠాపురం, విశాఖపట్నం, రంపచోడవరం, చెన్నైలోని శ్రీవారి ఆలయాల్లో, బెంగళూరు, వేలూరులోని సమాచార కేంద్రాల్లో ఈనెల 2న 50 వేలు, 3న 13 వేలు, 4న 9,500 లడ్డూలు విక్రయించినట్టు తెలిపారు. టీటీడీ స్థానిక ఆలయాలు, సమాచార కేంద్రాల్లో కూడా లడ్డూలు పొందవచ్చన్నారు.

ఆలయాల్లో శ్రీవారి లడ్డూల విక్రయం



శ్రీనివాసమంగాపురంలో లడ్డూల విక్రయకేంద్రం

చంద్రగిరి, సెప్టెంబరు 4:శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి,పేరూరులోని వకుళమాత ఆలయాల్లో శ్రీవారి లడ్డూల విక్రయ కేంద్రాలను టీటీడీ ప్రారంభించింది. ప్రస్తుతం శ్రీనివాసమంగాపురంలోని ఆలయానికి ఆరు వేల లడ్డూలు, వకుళమాత ఆలయానికి వెయ్యి లడ్డూలు సరఫరా చేశారు. లడ్డు రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో తిరుమలకు భక్తుల సంఖ్య తగ్గడంతో భక్తుల విజ్ఞప్తి మేరకు స్థానిక ఆలయాలు, సమాచార కేంద్రాల్లో కూడా లడ్డూ ప్రసాదాలను విక్రయిస్తున్నామని టీటీడీ ఈవో తెలిపారు.

అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు
ది బెస్ట్ ఎంప్లాయిబిలిటీ ఇనిషియేటివ్ అవార్డు



అవార్డును అందుకుంటున్న రవికుమార్, సతీష్ రాళ్లపల్లి

రేణిగుంట, సెప్టెంబరు 4: అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ది బెస్ట్ ఎంప్లాయిబిలిటీ ఇనిషియేటివ్ అవార్డు దక్కించుకుంది. బుధవారం బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో జియాంగ్గీ బిజినెస్ సెంటర్ డైరెక్టర్ జాంటీ జంగ్, కంబోడియా కాన్సులేట్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, యూసి దారివాల్ చేతుల మీదుగా జాతీయ హెచ్ఆర్ ఎక్సలెన్స్ అవార్డును అమరరాజా ఫౌండేషన్ సభ్యులు అందుకున్నారు. యువతలో నైపుణ్యం, విజ్ఞానం పెంపొందించి మెరుగైన జీవనోపాధి అవకాశాలను అందిస్తున్నందుకు ఈ లభించినట్లు ప్రకటించారు.

నేడు ఎస్వీయూలో టీచర్స్ డే

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 4: ఎస్వీయూలో గురువారం టీచర్స్ డే కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు శ్రీనివాసా ఆడిటోరియంలో కార్యక్రమం ప్రారంభం కానుంది. ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఇతర అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొంటారు. అధ్యాపకులకు బెస్ట్ టీచర్ అవార్డులు ప్రదానం చేయనున్నారు.

సదరన్ డిస్కం కార్యాలయ ముట్టడి వాయిదా



కాంట్రాక్టు కార్మికులతో చర్చిస్తున్న హెచ్ఆర్‌డీ సీజీఎం రమణాదేవి

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 4: విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల సాధన కోసం గురువారం చేపట్టనున్న సదరన్ డిస్కం కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు వెల్లడించారు. స్థానిక ఏపీ ఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలు చేస్తున్న శిబిరం వద్దకు చేరుకుని సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వరదల దృష్ట్యా ఆందోళన వాయిదా వేశామన్నారు. అంతకు ముందు దీక్ష చేస్తున్న కార్మికులతో సంస్థ సీజీఎం హెచ్ ఆర్‌డీ రమణాదేవి చర్చలు జరిపారు. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితుల్లో ఆందోళనవిరమించుకొని వరద బాధితులకు సేవలందించాలని కోరారు. సీఐటీయూ నాయకులు సహకరించాలని కోరారు. దీంతో నాయకులు పై నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మధుశేఖర్‌కు పలువురి శుభాకాంక్షలు



భారీకేక్ కట్‌చేస్తున్న మధుశేఖర్, టీడీపీ నేతలు

తిరుపతి రూరల్, సెప్టెంబరు 4: తిరుపతి రూరల్ మండలం వేమూరు గ్రామానికి చెందిన టీడీపీ చిత్తూరు పార్లమెంటరీ వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు చెరుకూరి మధుశేఖర్ జన్మదినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ నేతల సమక్షంలో భారీకేక్‌ను కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈయన్ను పలువురు నాయకులు, బంధుమిత్రులు, సన్నిహితులు కలసి అభినందించారు. టీడీపీ నాయకులు అమిలినేని మధు, రావిళ్ల సురేంద్ర నాయుడు, గణపతి నాయుడు, నాగూరు శ్రీనివాసులు, జనార్ధన్ చౌదరి, కిశోర్, మోహన్‌రెడ్డి, హరిరామ్, సాయి, జనార్ధన్, రాజు, మునిరత్నంరెడ్డి తదితరులు కలసి శుభాకాంక్షలు తెలిపారు.



అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణం (తిరుమల బైపాస్‌రోడ్డు నుంచి సత్యనారాయణ పురం మీదుగా)

ఈ రోడ్డుకు మోక్షం ఎపుడో..?

● అసంపూర్తిగా నిర్మాణం

● వాహనదారులకు తప్పని ఇక్కట్లు

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 4: తిరుమల బైపాస్ రోడ్డు నుంచి సత్యనారాయణపురం సర్కిల్ వరకు సిమెంటురోడ్డు నిర్మాణాన్ని గతలో చేపట్టారు. 30 అడుగులు ఉన్న రోడ్డును పది అడుగులు పెంచి (ఉన్న ఇళ్లను తొలగించి) 40 అడుగుల రోడ్డుగా తీర్చిదిద్దారు. అయితే ఈరోడ్డు నిర్మాణం మాత్రం అసంపూర్తిగానే ఉండిపోయింది. మొత్తంగా 400 మీటర్ల రోడ్డు ఉండగా, అందులో 360 మీటర్ల సిమెంటు రోడ్డు వేశారు. మిగిలిన 40 మీటర్ల రోడ్డును స్థలవివాదం పేరుతో అలాగే వదిలేశారు. ఈ రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. రోడ్డు ఎక్కేసమయంలో చిన్నపాటి ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణంపై దృష్టి సారించి సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

తిరుపతి

బ్రహ్మోత్సవాల్లో అదనపు ట్రిప్పులు : డీపీటీవో


అదనపుఈవోకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీపీటీవో చెంగల్‌రెడ్డి

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 4: త్వరలో ప్రారంభం కానున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆర్టీసీ బస్సుల ద్వారా అదనపు ట్రిప్పులు తిప్పుతామని ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి వివరించారు. బుధవారం ఆయన తిరుమలలో అదనపు ఈవోను మర్యాదపూర్వకంగా కలిసి, శాలువకప్పి సత్కరించారు. అనంతరం చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం కనుమదారిలో మొత్తం 410 బస్సులు నడుపుతున్నామని, రోజుకు దాదాపు 1500 ట్రిప్పులు తిరుగుతాయని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో అదే బస్సుల సంఖ్యతో అదనంగా 500 ట్రిప్పులు తిరిగేలా చర్యలు చేపట్టామన్నారు. గరుడ సేవకు 3వేల ట్రిప్పులు తిరిగేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అదనపు సిబ్బందిని కూడా రప్పిస్తున్నామన్నారు. గతంలో మాదిరిగా పార్కింగ్ స్థలాలు కేటాయించాలని కోరారు. అదనపు ఈవో స్పందిస్తూ.. పోలీసు, విజిలెన్స్ విభాగాలతో సమన్వయం చేసుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తిరుమల డిపో మేనేజర్ విశ్వనాథం కూడా పాల్గొన్నారు.

వరద బాధితులకు సేవలందిద్దాం


మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌నాథ్ లింగుట్ల

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 4: విజయవాడ వరద బాధితులకు రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవలందించినట్లు ఫౌండేషన్‌అధ్యక్షుడు డాక్టర్ రమేష్‌నాథ్ లింగుట్ల తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబును స్ఫూర్తిగా తీసుకుని రాజకీయాలకు అతీతంగా విజయవాడ నగర పరిధిలోని ఆటోనగర్, రాజరాజేశ్వరి ఆలయం తదితర ప్రాంతాల్లో పర్యటించి సుమారు 3వేలమందికి పైగా నిరాశ్రయులకు భోజనం, వాటర్‌బాటిల్స్ అందించినట్లు తెలిపారు. మానవతా దృక్పథంతో ప్రతిఒక్కరూ వరదబాధితులకు సేవలుఅందించాలని పిలుపునిచ్చారు.

22న వారాహి మహారథయాత్ర



తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 4: తిరుచానూరులోని శ్రీఆదివారాహి శక్తి ట్రస్టు ఆధ్వర్యంలో 22వ తేదీ తిరుపతి నుంచి విశాఖపట్టణం వరకు వారాహి మహారథయాత్ర ప్రారంభమవుతుందని టీడీపీ నాయకుడు మబ్బు దేవనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన ఆదివారాహి శక్తి రాష్ట్ర అధ్యక్షుడు మహారుద్ర వారాహిస్వామి, శివశంకర్ ప్రసాద్, శ్రీరాములతో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాలతో జరుగుతున్న నష్టాలన్నీ ఆధ్యాత్మికంగా ఆపడానికి ఈ మహారథయాత్రను జరుపుతున్నట్లు తెలిపారు. 22న మొదటి రోజున జీవకోన ఆలయం నుంచి మొదలై నగర పురవీధుల్లో ఈ రథయాత్ర సాగుతుందని, అదే విధంగా తిరుపతి, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, కాకినాడ మీదుగా చివరికి 28న విశాఖపట్టణం చేరుకుంటుందని తెలిపారు.

తిరుపతి రైల్వేస్టేషన్ నిర్మాణాలను పరిశీలించిన ఎంపీ



తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు 4: తిరుపతి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న ప్రపంచస్థాయి అభివృద్ధి పనులను బుధవారం తిరుపతి పార్లమెంట్ సభ్యుడు ఎం.గురుమూర్తి పరిశీలించారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో రూ.300 కోట్లతో ఆధునిక వసతులతో నిర్మాణాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. అభివృద్ధి పనుల గురించి డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. తిరుపతి-రేణిగుంట రైల్వే స్టేషన్ల మధ్య అండర్ బ్రిడ్జిల నిర్మాణాల తీరును అడిగి తెలుసుకున్నారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పూర్తి చేస్తే తిరుపతి నగరానికి తలమానికంగా నిలుస్తుందన్నారు. అభివృద్ధి పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకున్నారు. పనులను వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 16మందికి జరిమానా

తిరుపతి(లీగల్), సెప్టెంబరు 4: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 16మంది నిందితులకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి 4వ అదనపు మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు.

శ్రేష్టగురు అవార్డు ప్రదానం


శారదవేణికి అవార్డు అందించి సత్కరిస్తున్న దృశ్యం

తిరుపతి(విద్య), సెప్టెంబరు 4: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక మేక్‌మైబేబీజీనియస్ స్కూల్‌లో బుధవారం జరిగిన గురుపూజోత్సవంలో సరోజినీదేవి రోడ్డులోని మున్సిపల్‌స్కూల్ సెకండరీ గ్రేడ్ టీచర్ బి.శారదవేణికి శ్రేష్టగురు అవార్డును ఉప విద్యాశాఖాధికారి బాలాజీ చేతుల మీదుగా ప్రదానం చేశారు. అనంతరం ఆమెకు శాలువకప్పి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆమెను పలువురు ప్రముఖులు అభినందించారు.

7న కపిలేశ్వరాలయంలో వినాయక చవితి

తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 4: కపిలేశ్వర స్వామి ఆలయంలో కొలువైన వినాయకుడికి ఈ నెల 7వ తేదీ శనివారం చవితి వేడుకలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతం తరువాత మూలవర్లకు అభిషేకం, అర్చన జరుగుతుంది. సాయంత్రం 5.30 గంటలకు వినాయక స్వామి మూషిక వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు. అలాగే తిరుమల రెండో ఘాట్ రోడ్డు లోని వినాయక ఆలయంలో కూడా ఉదయం 8 నుంచి 9 గంటల వరకు మూలవర్లకు అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

'వైసీపీ కబ్జాలతోనే విజయవాడలో జల విపత్తు'

తిరుపతి(ఉపాధ్యాయనగర్), సెప్టెంబరు 4: విజయవాడ చుట్టుపక్కల చెరువులను వైసీపీ నాయకులు కబ్జా చేయడంవల్లనే నేడు జల విపత్తు సంభవించిందని బీజేపీ నాయకుడు విష్ణువర్ధనరెడ్డి ఆరోపించారు. తిరుపతిలో బుధవారం జరిగిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... వైసీపీ నాయకుల దురాక్రమణలపై బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఫిర్యాదులను స్వీకరించేందుకు ఓ సెల్ ఏర్పాటుచేశామని, కుప్పలు తెప్పలుగా తమకు ఫిర్యాదులు అందుతున్నాయని వివరించారు. సోషల్ మీడియాలో వైసీపీ దుష్ప్రచారాలను తీవ్రంగా ఖండించారు. వరద ప్రభావం తగ్గిన 90 రోజుల్లోనే నష్టపరిహారం చెల్లించడానికి ఎన్‌డీయే ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

యద్దనపూడి సాహిత్యంపై పరిశోధనలు సాగాలి

పుస్తక పరిచయ సభలో వక్తల మనోభావం



సభలో మాట్లాడుతున్న గల్లా అరుణకుమారి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 4: ప్రముఖ రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి సాహిత్యంపై సమగ్ర పరిశోధన సాగాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. ఎస్వీయూ తెలుగు విభాగం - ఓఆర్ఐ విభాగం సంయుక్తంగా యద్దనపూడి సులోచనారాణి సాహిత్య వివేచన' పుస్తక పరిచయ సభను బుధవారం సాయంత్రం ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో నిర్వహించాయి. ఆకాశవాణి మాజీ డైరెక్టర్ నాగసూరి వేణుగోపాల్ అధ్యక్షతన ఈ సభ నిర్వహించారు. రచయిత్రి, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి మాట్లాడుతూ.. దశాబ్దాల క్రితమే యద్దనపూడి నవలలు తనను ప్రభావితం చేశాయని చెప్పారు. ఈ స్ఫూర్తితోనే తాను కూడా రచయిత్రిగా సాహిత్య సృజన చేశానని తెలిపారు. క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న వారిలో ఆత్మ స్థైర్యాన్ని నింపేలా యద్దనపూడి రచనలు ఉన్నాయన్నారు. విజేత నవల చదివి తాను కూడా ఎంతో మనోనిబ్బరాన్ని పెంచుకున్నానని అన్నారు. ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు మాట్లాడుతూ.. సమాజాన్ని మార్చే శక్తి సాహిత్యానికి ఉందన్నారు. తెలుగు సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి అని అభిప్రాయపడ్డారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ.. కుటుంబ, మానవ, స్త్రీ పురుష సంబంధాలను ఉన్నతీకరించే లక్ష్యంతో యద్దనపూడి సులోచనారాణి సాహిత్యం దోహదం చేస్తూ ఉందన్నారు. ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ డాక్టర్ ఆర్‌ఎం ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యానికి పాఠకులు ఎక్కువ పెరగడంలో ఇటు యద్దనపూడి, అటు రంగనాయకమ్మ కృషి చేశారన్నారు. ఇరువురి రచనల్లో భిన్నత్వం ఉన్నప్పటికీ పాఠకుల స్థాయిని పెంచిన రచయిత్రులుగా వీరికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.. తెలుగు విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ మాట్లాడుతూ.. విద్యార్థి దశలో యద్దనపూడి నవలలు చదివానని గుర్తు చేసుకున్నారు. యద్దనపూడి సాహిత్యంపై తెలుగు విభాగంలో పరిశోధనలు చేపడతామని స్పష్టం చేశారు. ఓఆర్ఐ డైరెక్టర్ ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. యద్దనపూడి సులోచనారాణి సాహిత్యంలోని అంతస్సారాన్ని ఈ తరం అవగాహన చేసుకోవాలని కోరారు. అతిథులను వర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ పద్మనాభం సత్కరించారు.

యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు

సదరన్ డిస్కం నుంచి పాల్గొన్న65 బృందాలు - సీఎండీ కె.సంతోషరావు


విజయవాడ వాంబే కాలనీలో విద్యుత్ పనులు చేస్తున్న తిరుపతి రూరల్ డివిజన్ అధికారులు

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 4: విజయవాడలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులకు సదరన్ డిస్కం నుంచి 65 బృందాలు వెళ్లాయని బుధవారం సీఎండీ కె.సంతోషరావు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ నగరంలో అస్తవ్యస్తంగా మారిన విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించి, సరఫరాను పునరుద్ధరించడానికి సదరన్ డిస్కం నుంచి 810 మంది సిబ్బందిని పంపినట్లు ఆయన పేర్కొన్నారు. ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ల ఆదేశాలమేరకు ప్రత్యేక బృందాలను పంపినట్లు చెప్పారు. వరదలు వచ్చిన మరుసటి రోజునుంచే తిరుపతి రూరల్ డివిజన్ నుంచి మూడు బృందాలు పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమైవున్నారని తెలిపారు. విజయవాడ నగరంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను తమకు అప్పగించారని ఆయన తెలిపారు. గత మూడు రోజులుగా స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వరద నీరు తగ్గిన ప్రాంతాల్లో పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు. నగరంలో తాగునీటి సరఫరా, గృహాలకు విద్యుత్ సరఫరా చేయడానికి మొదటి ప్రాధాన్యతగా పనులు జరుగుతున్నాయని సీఎండీ తెలిపారు. వాంబేకాలనీలో 20వేల గృహాలకు తిరుపతి రూరల్ డివిజన్ సిబ్బంది చేస్తున్న విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను సీఎండీ పరిశీలించారు.

విద్యార్థులంతా స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

గురువుల గొప్పదనాన్ని గుర్తించాలి - సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ


లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న ఎన్ఆర్ఐ విద్యాసంస్థల డైరెక్టర్ తదితరులు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 4: విద్యార్థులు స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ సూచించారు. ఉపాధ్యాయ దినోత్సవం, ఎన్ఆర్ఐ కళాశాల ఫ్రెషర్స్ సంబరాలు స్థానిక మహతి ఆడిటోరియంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... విద్యార్థులు ఏకాగ్రతగా చదువు సాగించాలని సూచించారు. అబ్దుల్ కలాంను మార్గదర్శకంగా తీసుకుని చదివితే ఉన్నత శిఖరాలకు చేరుతారని చెప్పారు. తల్లిదండ్రులు, గురువులు చూపిన మార్గంలో నడిచి జీవితాలను సార్థకం చేసుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్, వాట్సాప్, ఫేస్‌బుక్, బిగ్‌బాస్ లాంటి చెత్త విషయాలపై దృష్టి తగ్గిస్తే విజయాలు మీ వెన్నంటి నడుస్తాయని ఉద్బోధించారు. అనంతరం లక్ష్మీనారాయణను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో ఎన్ఆర్ఐ విద్యాసంస్థల డైరెక్టర్ భాస్కర్‌రావు, సీఈఓ జూపిటర్ ప్రసాద్‌రావు, రమేష్‌బాబు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా పనిచేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్

తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు 4: రైలు ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా అన్ని విభాగాలు పనిచేయాలని అదనపు ఎస్పీ రవిమనోహరాచారి అన్నారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లోని వీఐపీ ఛాంబర్‌లో బుధవారం లా అండ్ ఆర్డర్, బాంబుడిస్పోజల్ విభాగం, స్పెషల్ ఇంటెలిజెన్స్ విభాగం, జీఆర్‌పీ, రైల్వే భద్రతా దళాల అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రైల్వే ప్రయాణికుల పట్ల ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ విభాగాలు తీసుకుంటున్న చర్యలను ఐపీఎఫ్ అధికారి మధుసూదన్ వివరించారు. రైల్వే స్టేషన్లలో నష్టాలు జరుగకుండా అన్ని విభాగాలు సహకరించాలని కోరారు. అన్ని విభాగాల సహకారం ఉంటుందని అదనపు ఎస్పీ రవిమనోహరాచారి చెప్పారు. రైళ్లలో జరుగుతున్న నిషేధిత వస్తువుల అక్రమ రవాణాను అరికట్టాడానికి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. క్షేత్రస్థాయి సిబ్బందికి ప్రయాణికుల లగేజీలు, వస్తు రవాణా విభాగాల్పై అవగాహన కల్పించాలని సూచించారు. రైల్వే విభాగానికి, భారత ఆర్థిక వ్యవస్థకు నష్టం వాటిల్లే విధంగా తీవ్ర వాద సంస్థలనుంచి వస్తున్న సమాచారాలపై, తీసుకోవలసిన పటిష్ఠ భద్రతా చర్యలపై అధికారులు చర్చించారు. సమావేశంలో తిరుపతి డీసీఐవో ఐబీ అధికారి పి.శిరీష, డీఎస్పీలు, ఇతర శాఖల ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఇద్దరు స్మగ్లర్ల అరెస్టు

19 ఎర్రచందనం దుంగల స్వాధీనం


పట్టుబడ్డ స్మగ్లర్లతో టాస్క్‌ఫోర్సు సిబ్బంది

మంగళం, సెప్టెంబరు 4: సత్యవేడు అటవీ ప్రాంతంలో బుధవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేసి, 19 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఆర్ఐ చిరంజీవికి చెందిన ఆర్ఎస్ఐ ఎం.మురళీధర్ రెడ్డి బృందం మంగళవారం సత్యవేడు సమీపంలో బీరకుప్పం సెక్షన్ ఎస్‌కే మడుగు వద్ద కూంబింగ్ చేపట్టారు. బుధవారం ఉదయం భూపతేశ్వర కోన వద్ద స్మగ్లర్లు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ టాస్క్‌ఫోర్సు పోలీసులకు కనిపించారు. వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా, దుంగలు కింద పడేసి పారిపోయారు. అయితే పోలీసులు ఇద్దరిని పట్టుకోగలిగారు. వారు నాగలాపురానికి చెందిన వ్యక్తులుగా గుర్తించి, తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్ స్టేషన్‌కు తరలించి ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూతన బాధ్యతలు చేపట్టిన అధికారులకు సన్మానం


బదిలీపై వచ్చిన రుయా ఏడీ ధాత్రేశ్వరి దేవిని సన్మానిస్తున్న ఏపీ హంస నేతలు

తిరుపతి (వైద్యం), సెప్టెంబరు 4: వైద్య శాఖలో ఇటీవల పదోన్నతులు పొందిన, బదిలీపై వచ్చిన పలువురు అధికారులను ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా ఆధ్వర్యంలో ఆ సంఘం నేతలు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీపద్మావతమ్మ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందిన డాక్టర్ శశికళ, ఇదే కళాశాలలో ఏవోగా పదోన్నతి పొందిన భానుమతి, జిల్లా వైద్యఆరోగ్యశాఖ జిల్లా పబ్లిక్ హెల్త్ నర్స్‌గా పదోన్నతి పొంది బాధ్యతలు స్వీకరించిన రీటా, రుయాస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ధాత్రేశ్వరి దేవిలను ఏపీ హంస నేతలు సన్మానించారు. ఆయా విభాగాల్లో ఉద్యోగుల సంక్షేమంలో తమవంతు సహకారాన్ని అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఇమ్రాన్, జాయింట్ సెక్రటరీ రాజేశ్వరి, తిరుపతి తాలూకా అధ్యక్షుడు రాజేష్, కార్యదర్శి సురేంద్ర, నేతలు శాంతకుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా తెలుగు యువత



తిరుపతి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితులకు తెలుగు యువత అండగా నిలుస్తోంది. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా బుడమేరు ప్రాంతంలో సహాయక చర్యలు చేపట్టారు. వరద బాధితులకు పాలు, బిస్కెట్స్, వాటర్ బాటిల్స్, ఫుడ్ ప్యాకెట్స్ పంపిణీ చేస్తున్నారు. జయశంకర్, నాగూర్, వెంకట్రావు, శ్రీధర్ పాల్గొంటున్నారు.

వరద సహాయ చర్యలకు తరలివెళ్లిన మున్సిపల్ ఉద్యోగులు


ఆర్టీసీ బస్సుల్లో తరలివెళ్తున్న మున్సిపల్ ఉద్యోగులు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 4: విజయవాడలో వరద సహాయ చర్యల నిమిత్తం తిరుపతి మున్సిపల్ సిబ్బందిని తరలించేందుకు రెండు ఆర్టీసీ బస్సులను కేటాయించారు. నగర కమిషనర్ మౌర్య ఆదేశాల మేరకు విధుల్లో భాగంగానే అధికారులు, ఇతర ఉద్యోగులు దాదాపు 75మందిని ఎంపిక చేశారు. బుధవారం రాత్రి 9గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి రెండు అల్ట్రాడీలక్స్ బస్సుల్లో తరలివెళ్లారు. విజయవాడకు గురువారం ఉదయం చేరుకోనున్నారు.

వరద బాధితులను ఆదుకోండి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి


భిక్షాటన కార్యక్రమంలో పాల్గొన్న నర్సింగరావు

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 4: విజయవాడ నగరంలో జరిగిన వరద బీభత్సానికి గురైన బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాకార్యదర్శి సీహెచ్ నర్సింగరావు వెల్లడించారు. తిరుపతిలో కొద్దిరోజులుగా టీటీడీ పరిపాలన భవనం ఎదుట నిరాహార దీక్షలు చేస్తున్న వారికి బుధవారం ఆయన సంఘీభావం తెలిపారు. అనంతరం భవానీనగర్ కూడలి వద్ద వరద బాధితుల నిధి వసూలు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ పరిసర ప్రాంతాలు వరద తాకిడికి అతలాకుతలమైనట్లు చెప్పారు. ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని, వారిని ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. బుధవారం సేకరించిన రూ.25,000లను పార్టీ కేంద్ర కమిటీకి పంపినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి తెలిపారు. దాతలు ముందుకు వచ్చి విరాళాలు ఇవ్వాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో జి.బాలసుబ్రమణ్యం, ఎస్.జయచంద్ర, ఆర్.లక్ష్మి, టి.సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

చెక్కు బౌన్స్ కేసులో ఏడాది జైలు శిక్ష

తిరుపతి(లీగల్), సెప్టెంబరు 4: చెక్కు బౌన్స్ కేసులో తిరుపతి తుమ్మలగుంటలో ఓ అపార్టుమెంట్‌లో నివాసముంటున్న సి.పూర్ణచంద్రారెడ్డికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ ఆరవ అదనపు మున్సిఫ్‌కోర్టు బుధవారం తీర్పు ఇచ్చింది. న్యాయవాది కె.చక్రవర్తి తెలిపిన కేసు వివరాల మేరకు.. తిరుచానూరు రోడ్డు శ్రీనివాసపురానికి చెందిన కె.వెంకటరవిచంద్ర వద్ద 2015 జనవరి 30న పూర్ణచంద్రారెడ్డి రూ.13లక్షలు అప్పు తీసుకున్నాడు. అప్పు చెల్లించే క్రమంలో ఆయన రూ.10లక్షలకు ఇచ్చిన చెక్కు బౌన్స్ అయింది. దీంతో వెంకటరవిచంద్ర కోర్టును ఆశ్రయించారు. కేసు నిరూపణ కావడంతో పూర్ణచంద్రారెడ్డి నెల లోపు రూ.14.2లక్షలు చెల్లించాలని కోర్టు ఆదేశించింది. అలాగే ఏడాదిపాటు జైలు శిక్ష కూడా విధించింది.

20లోగా ఓటరు జాబితా సవరణ: కలెక్టర్

దొరవారిసత్రం, సెప్టెంబరు 4: ఎన్నికల కమిషన్ ఆదేశాల ఓటర్ల జాబితా సవరణను ఈ నెల 20వ తేది లోగా బీఎల్వోలు పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. ఆయన బుధవారం ఓటరు జాబితా సవరణను దొరవారిసత్రం మండలం నెలబల్లిలో బీఎల్వోలతో కలిసి పరిశీలించారు. కుటుంబ సభ్యులందరినీ ఒకే చోట చేర్చి సవరణ చేపట్టాలన్నారు. అలాగే ఓటరు ఇష్టం మేరకు వారికి అవసరమైన చోట ఓటు హక్కు కల్పించాలన్నారు. చనిపోయిన, వలస వెళ్లిన వారి ఓట్లు తొలగించే సమయంలో వారి సంబంధీకులనుంచి సరైన సమాచారం తీసుకుని తదుపరి చర్యలు చేపట్టాలన్నారు. తహసీల్దారు శైలాకుమారి, ఆర్డీవో కార్యాలయ ఏవో రవికుమార్, డీటీ గోపీనాథ రెడ్డి, ఎస్ఐ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణలపై మరో సారి శిక్షణ

తడ, సెప్టెంబరు 4: ఓటరు జాబితా సవరణలపై జిల్లాలోని బీఎల్వోలకు మరో సారి శిక్షణ ఇస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఆయన కాదలూరు, తడ కండ్రిగ గ్రామాల్లో ఓటరు సవరణలను పరిశీలించారు. సవరణలు పక్కాగా చేయాలని, ఎలాంటి తప్పులకు ఆస్కారం ఉండకూడదని బీఎల్వోలను ఆదేశించారు. తహసీల్దారు రవికుమార్, ఎంపీడీవో విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను కాదలూరు మాజీ సర్పంచ్ వి.చంద్రయ్య శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు.

గురుకుల పాఠశాల తనిఖీ


విద్యార్థులతో కలెక్టర్ సహపంక్తి భోజనం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 4: పట్టణంలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో అత్యధిక విద్యార్థులున్న సూళ్లూరుపేట గురుకులం గత ఏడాది టెన్త్‌లో 98 శాతం ఉత్తీర్ణత సాధించిందని, ఈ ఏడాది వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపర్చుకోవాలని, వంటశాల పరిసరాలు ఇంకా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకుని వారితో కలసి భోజనం చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో గురుకులం వైస్ ప్రిన్సిపాల్ రేచల్ వాణి, ఆర్డీవో కార్యాలయ డీఏవో రవికుమార్, డీటీ చైతన్య, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం: ఎస్పీ


పోస్టర్ల ఆవిష్కరణలో ఎస్పీ తదితరులు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 4: అసాంఘిక కార్యక్రమాల్లో భాగంగా గంజాయి రవాణా, వినియోగంపై ఉక్కు పాదం మోపుతామని అందుకు బాధ్యులైన వారిపైన చట్టపరమైన చర్యలు తప్పవని తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు. నాయుడుపేట డీఎస్పీ కార్యాలయంలో బుధవారం గంజాయి నిర్మూలన పోస్టర్లను పోలీస్ అధికారులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి వినియోగ నివారణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డీఎస్పీ చెంచుబాబు, సీఐలు బాబి, సంగమేశ్వరరావు, హుస్సేన్‌బాషా, ఎస్ఐ రవిబాబు, సిబ్బంది ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఇద్దరి ఎంపిక

పెళ్లకూరు, సెప్టెంబర్, 4: జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా మండలానికి చెందిన ఇద్దరు ఎంపికైనట్లు ఎంఈవో ఎం.శంకరయ్య తెలిపా రు. యడఘూడి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వి.బాలసుబ్రహ్మణ్యం, కానూరు రాజుపాలెం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు దోరతి వయోలా జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు ఆయన చెప్పారు. గురుపూజోత్సవం సందర్భంగా గురువారం తిరుపతిలో వీరికి ఉత్తమ ప్రశంసాపత్రాలతో పాటు జ్ఞాపికలు అందజేయనున్నట్లు తెలిపారు.

నేడు ఉత్తమ గురువులకు సన్మానం

వాకాడు, సెప్టెంబరు 4 : గురుపూజ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మండలంలోని షాదీమంజిల్‌లో మధ్యాహ్నం 2 గంటలకు ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్నట్టు ఎంఈవో నసీం అలీ తెలిపారు. పి.శ్రీనివాసరావు, ఎస్‌కె రహీదా, కె.సుష్మ, ఎం.హరికృష్ణ, టి.సుభాషిణిని సన్మానిస్తున్నట్టు తెలిపారు.

నావెల్ ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక



కోట, సెప్టెంబరు 4: మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 2024 నావెల్ ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక జరిగింది. 23 ఖాళీల భర్తీకి 130 మంది విద్యార్థులకు శారీరక పరీక్షలు నిర్వహించారు. ఈ ఎంపిక ప్రక్రియ 10ఆంధ్రా నావెల్ ఎన్‌సీసీ కమాండెంట్ ఆఫీసర్ గణేష్, స్థానిక ఎన్‌సీసీ అధికారి డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, అనిల్‌శర్మ, సుధాకర్, సునీల్ పర్యవేక్షణలో జరిగాయి. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, సాగర్‌ముకుంద పర్యవేక్షించారు.

ఇద్దరు స్మగ్లర్ల అరెస్టు

19 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



మంగళం, సెప్టెంబరు 4: సత్యవేడు అటవీ ప్రాంతంలో బుధవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేసి, 19 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఆర్ఐ చిరంజీవికి చెందిన ఆర్ఎస్ఐ ఎం.మురళీధర్‌రెడ్డి బృందం మంగళవారం సత్యవేడు సమీపంలో బీరకుప్పం సెక్షన్ ఎస్‌కే మడుగు వద్ద కూంబింగ్ చేపట్టారు. బుధవారం ఉదయం భూపతేశ్వర కోన వద్ద స్మగ్లర్లు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ టాస్క్‌ఫోర్సు పోలీసులకు కనిపించారు. వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా, దుంగలు కింద పడేసి పారిపోయారు. అయితే పోలీసులు ఇద్దరిని పట్టుకోగలిగారు. వారు నాగలాపురానికి చెందిన వ్యక్తులుగా గుర్తించి, తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెక్కు బౌన్స్ కేసులో ఏడాది జైలు శిక్ష

తిరుపతి(లీగల్), సెప్టెంబరు 4: చెక్కు బౌన్స్ కేసులో తిరుపతి తుమ్మలగుంటలో ఓ అపార్టుమెంట్‌లో నివాసముంటున్న సి.పూర్ణచంద్రారెడ్డికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ ఆరవ అదనపు మున్సిఫ్‌కోర్టు బుధవారం తీర్పు ఇచ్చింది. న్యాయవాది కె.చక్రవర్తి తెలిపిన కేసు వివరాల మేరకు.. తిరుచానూరు రోడ్డు శ్రీనివాసపురానికి చెందిన కె.వెంకటరవిచంద్ర వద్ద 2015 జనవరి 30న పూర్ణచంద్రారెడ్డి రూ.13లక్షలు అప్పు తీసుకున్నాడు. అప్పు చెల్లించే క్రమంలో ఆయన రూ.10లక్షలకు ఇచ్చిన చెక్కు బౌన్స్ అయింది. దీంతో వెంకటరవిచంద్ర కోర్టును ఆశ్రయించారు. కేసు నిరూపణ కావడంతో పూర్ణచంద్రారెడ్డి నెలలోపు రూ.14.2లక్షలు చెల్లించాలని కోర్టు ఆదేశించింది. అలాగే ఏడాదిపాటు జైలు శిక్ష కూడా విధించింది.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 16మందికి జరిమానా

తిరుపతి(లీగల్), సెప్టెంబరు 4: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 16మంది నిందితులకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి 4వ అదనపు మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

తుపాను హెచ్చరికలపై అప్రమత్తం

ఓజిలి, సెప్టెంబరు 4: తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఓజిలి మండల ప్రజలను తహసీల్దారు పద్మావతి అప్రమత్తం చేశారు. మండలంలోని మామిడి కాలువ పరివాహక ప్రాంతాలైన మనవాలి, గ్రద్దగుంట, నెమళ్లపూడి, పున్నేపల్లి, కురుగొండ, మానమాల తదితర గ్రామాల ప్రజలను అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని తెలిపారు. ఈక్రమంలో ఆయా గ్రామాలలోని వీఆర్వోలను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ఇప్పటికే వర్షాలు కురుస్తున్న క్రమంలో రానున్న రెండు రోజులు జాగ్రత్తగా ఉండాలన్నారు. డీటీ మధుసూదన రాజు పాల్గొన్నారు.

మా ఊరి రోడ్లు బాగు చేయండి సారూ...

● కలెక్టర్‌కు నెలబల్లి దళితకాలనీ మహిళల మొర


కలెక్టర్‌కు విన్నవిస్తున్న దళిత కాలనీ మహిళ రమణమ్మ

దొరవారిసత్రం, సెప్టెంబరు 4: మా ఊర్లో రోడ్లు వర్షం కురిస్తే రొచ్చు రొచ్చుగా మారితున్నాయి... మీరు చూస్తున్నారుగా ఇళ్ల ముందు ఎలా ఉందో ... రోడ్లు వేయించండి సారు... అంటూ కలెక్టర్ వెంకటేశ్వర్‌కు దొరవారిసత్రం మండలం నెలబల్లి దళితవాడ మహిళలు మొరపెట్టుకొన్నారు. ఆ గ్రామంలో ఓటర్ల జాబిత సవరణలపై పరిశీలనకు వచ్చిన ఆయనకు మహిళల నుంచి సమస్యల మొర వినిపించాయి. ఇద్దరు బిడ్డలకు పెళ్లిళ్ల అయ్యాయి, అయినా ఇల్లు ఇవ్వలేదని ఓ మహిళ, బడిలో బిడ్డలకు వంట చేయడానికి వంట గది లేదు అంటూ మరో మహిళ మొరపెట్టారు. అలాగే చిన్న గాలి తోలినా కరెంట్ తీసేస్తారని ఫిర్యాదు చేశారు. మహిళల సమస్యలను సావధానంగా ఆలకించిన కలెక్టర్ అక్కడే ఉన్న ఎంపీడీవో కార్యాలయ ఏవో రఘురామయ్యకు పరిష్కరించాలని ఆదేశించారు. పాఠశాలలో వంట గదికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. త్వరలో ప్రభుత్వం నివేశ స్థలాలతో పాటు, అర్హత కలిగిన ప్రతి పేదవాడికి ఇల్లు మంజూరు చేస్తుందని చెప్పారు. చిరునవ్వుతో కలెక్టర్ సమాధానం చెప్పడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.

లారీ దొంగల అరెస్టు: రూ.60 లక్షల సొత్తు స్వాధీనం


మీడియా సమావేశంలో ఎస్పీ తదితరులు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 4: ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి వారి నుంచి రూ.60 లక్షల విలువైన సొత్తును రికవరీ చేసినట్లు తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. నాయుడుపేట డీఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టులో కర్ణాటక రాష్ట్రం నుంచి ఐరన్ సామగ్రితో లారీ తమిళనాడుకు బయలు దేరింది. మార్గమధ్యంలో నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలో రాగానే లారీ యజమాని బాలాజీకి సంబంధించిన దుకాణం వద్ద డ్రైవర్ రవి వాహనాన్ని ఆపి నిద్రించేందుకు ఇంటికి వెళ్లాడు. తిరిగి మరుసటిరోజు ఉదయం వచ్చి చూసేసరికి లారీ లేకపోవడంతో చోరీకి గురైనట్లుగా గుర్తించిన లారీ యజమాని బాలాజీ నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు డీఎస్పీ చెంచు బాబు ఆధ్వర్యంలో అర్బన్ సీఐ బాబి, సిబ్బంది తో కలసి దర్యాప్తు చేసినట్లు ఎస్పీ తెలిపారు. వెంకటగిరి - పెంచలకోన మార్గమధ్యంలో ఈ కేసుకు సంబంధించి కాకినాడకు చెందిన గంగాధర్‌రావు, హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ ఇక్బాల్, మహ్మద్ అబ్దుల్‌ను అరెస్టుచేసి చోరీకి గురైన లారీ అందులో ఉన్న సామగ్రితోపాటు నిందితులు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై పలు రాష్ట్రాల్లో వివిధ కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నట్లు తెలిపారు. పోలీసులు స్వాధీనం చేసుకున్నవాటిలో రూ.20 లక్షల లారీ, రూ.30 లక్షల ఐరన్, నిందితులు ఉపయోగించిన రూ.10 లక్షల కారు ఉన్నాయి. కేసును ఛేదించిన డీఎస్పీ చెంచు బాబు, అర్బన్ సీఐ బాబి, వాకాడు సీఐ హుస్సేన్‌బాషా, ఎస్ఐ రవిబాబు, సిబ్బందికి ఎస్పీ రివార్డులను అందజేశారు.

బాధ్యతగా పనిచేసినా అవమానించారు

● అందుకే పార్టీ వీడా
● వైసీపీ ఆత్మీయ సమావేశంలో దువ్వూరు


సమావేశంలో మాట్లాడుతున్న దువ్వూరు బాలచంద్రారెడ్డి

దొరవారిసత్రం, సెప్టెంబరు 4: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ గెలుపు కోసం బాధ్యతగా పనిచేశా... అయితే పని చేయలేదని అవమానించారు.... అందుకే పార్టీ వీడుతున్నా... నాతో కలసి రండి... టీడీపీలో చేరుదాం అంటూ సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయ మాజీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం దొరవారిసత్రం మండలంలోని ఆయన స్వగ్రామమైన ఖైలాంగంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'ఎన్నికల ముందు పనబాక కుటుంబీకులకు సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ టిక్కెట్ వస్తే ఆ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నా. వారికి టిక్కెట్ రాకపోవడంతో వైసీపీలోనే కొనసాగా. బాధ్యతగా ఎన్నికల్లో పని చేశా. అయితే కొందరు నాయకులు పార్టీకి వె న్నుపోటు పొడిచినట్టు చిత్రీ కరించారు. అవమానక రంగా వ్యవహరించారు. అందుకే పార్టీకి రాజీనామా చేశా. ఈనెలలోనే టీడీపీలో చేరుతున్నా ' అని చెప్పారు. ఈ సమావేశంలో దొరవారిసత్రం మండలంలోని 22 పంచాయతీల నుంచి, సూళ్లూరుపేట, తడ, నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల నుంచీ కొందరు వచ్చారు. ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ, జడ్పీటీసీ సభ్యుడు రమేష్, కళత్తూరు శేఖర్‌రెడ్డి, ఇలుపూరు సుధయ్య, మునస్వామినాయుడు, ఓడూరు రమణారెడ్డి, కొండూరు రవిరెడ్డి, దువ్వూరు గోపాల్‌రెడ్డితోపాటూ దొరవారిసత్రం మండలానికి చెందిన 18 మంది సర్పంచులు, ఏడుగురు ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని విమర్శించను: దువ్వూరు

తడ, సెప్టెంబరు 4: టీడీపీ నాయకుల కోరిక మేరకు త్వరలోనే టీడీపీలో చేరుతున్నానని సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయ మాజీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి ఆంధ్రజ్యోతితో అన్నారు. వైసీపీతో తన అనుబంధం ముగిసినట్టే అని తెలిపారు. ఆ పార్టీపై తాను విమర్శలు చేయదలుచు కోలేదన్నారు. టీడీపీలో చేరిన తరువాత ఆ పార్టీ అధిష్ఠానం ఏ బాధ్యతలు అప్పగించినా చిత్తశుద్ధితో పనిచేస్తానని ఆయన తెలిపారు.

మాజీ అనుచరులతో వాకాటి సమాలోచనలు

తడ, సెప్టెంబరు 4: సూళ్లూరుపేట వైసీపీకి వరుస దెబ్బలు ఊపిరి ఆడకుండా చేసేలా ఉన్నాయి. ఓ పక్క చెంగాళమ్మ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి 250 మందిని టీడీపీలోకి తీసుకువెళ్తున్నారు. ఇదే వైసీపీకి పెద్ద దెబ్బ అనుకుంటుండగానే మరోదెబ్బ ఆ పార్టీకి తగిలేలా ఉంది. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి బుధవారం సూళ్లూరుపేటకు రావడం చర్చనీయాంశమైంది. ఆయన అనుచరులంతా వైసీపీలోనే కొనసాగుతున్నారు. వారిని అటు టీడీపీలో కానీ, ఇటు బీజేపీలోకి తీసుకువచ్చేలా ఆయన మంతనాలు సాగిస్తున్నట్లుగా సమాచారం. ఈ మేరకు ఇప్పటికే కొంతమంది ఆయన మాటకు జైకొట్టినట్టు తెలిసింది.

మరింత రుచికరంగా శ్రీవారి లడ్డూ ప్రసాదాలు

నాణ్యమైన ఆవు నెయ్యి కొనుగోలు చేస్తున్నామన్న టీటీడీ ఈవో

తిరుమల, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులకు మరింత రుచికరమైన లడ్డూ ప్రసాదాలు అందించేందుకు నాణ్యమైన ఆవు నెయ్యి కొనుగోలు చేస్తున్నట్టు టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ గోడౌన్ వద్ద బెంగళూరుకు చెందిన కర్ణాటక కో ఆపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ ఫెడరేషన్ లిమిటెడ్(కేఎంఎఫ్) నుంచి కొనుగోలు చేసిన నెయ్యి లారీ తిరుపతి నుంచి తిరుమలకు బుధవారం బయలు దేరింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈవో శ్యామలరావు అధికారులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఈవో మీడియాతో మాట్లాడుతూ.. లడ్డూ నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. గతంలో నాణ్యత, రుచి, వాసన లేని ఆవు నెయ్యి సరఫరా చేశారన్నారు.ఇప్పటివరకూ నాణ్యతను పరిశీలించేందుకు సరైన ల్యాబ్ లేదన్నారు.ప్రైవేట్ ల్యాబ్ సౌకర్యం ఉన్నా పరిశీలించలేదన్నారు. అందువల్ల అత్యాధునిక ల్యాబొరేటరీ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో సిబ్బందికి మైసూరులో శిక్షణ ఇస్తున్నామన్నారు. నెయ్యి కొనుగోలుపై నలుగురు డెయిరీ నిపుణులతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఇందులో ఎన్‌డీఆర్ఏ విశ్రాంత ఆచార్యులు సురేంద్రనాథ్, హైదరాబాద్‌కు చెందిన విజయభాస్కర రెడ్డి, స్వర్ణలత, బెంగళూరుకు చెందిన మహదేవన్ ఉన్నారన్నారు. నాణ్యమైన నెయ్యి కొనుగోలు టెండర్‌లో ఎలాంటి అంశాలు చేర్చాలో కమిటీ సూచించిందన్నారు. గతంలోని ఐదుగురు సరఫరాదారుల్లో ఒకరు అందించిన నెయ్యిలో నాణ్యతా ప్రమాణాలు సరిపోలడం లేదన్నారు. కల్తీ నెయ్యిని సరఫరా చేస్తున్నట్టు పరీక్షల్లో తేలిందన్నారు. దీంతో టెండర్ షరతులను సవరించినట్టు తెలిపారు. కొత్త షరతుల ప్రకారం డెయిరీలు నెయ్యి మరిగించడానికి ముందు కొన్ని గంటల పాటు ఎంపిక చేసిన స్టార్టర్ కల్చర్‌తో వెన్నను పక్వానికి తీసుకురావాలన్నారు. వెన్నను 120 డిగ్రీల సెంటీగ్రేడ్‌లో 2 నుంచి 5 నిమిషాలు వేడి చేయాలన్నారు. కర్ణాటక నందిని నెయ్యి కొనుగోలుకు ఆమోదం తెలిపామన్నారు. ఈ కంపెనీ నుంచి నేరుగా నెయ్యి కొనుగోలు చేస్తున్నట్టు వివరించారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో గౌతమి, సీవీఎస్వో శ్రీధర్, నందిని డెయిరీ లైజనింగ్ ఆఫీసర్ మల్లిఖార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఆలయాలకు లడ్డూల తరలింపు

భారీ వర్షాల నేపథ్యంలో తిరుమలకు భక్తుల సంఖ్య తగ్గిందని ఈవో తెలిపారు. ఈ నేపథ్యంలో భక్తుల విజ్ఞప్తి మేరకు టీటీడీ స్థానిక ఆలయాలు, సమాచార కేంద్రాల్లో కూడా లడ్డూ ప్రసాదాలను విక్రయిస్తున్నామన్నారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయం, కోదండరామస్వామి ఆలయం, శ్రీనివాసమంగాపురంలోని కళ్యాణవెంకటేశ్వరస్వామి ఆలయం, అప్పలాయగుంటలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం, ఒంటిమిట్ట లోని కోదండరామస్వామి ఆలయం,కడపలోని దేవుని కడప ఆలయం , హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్, జూబ్లీహిల్స్, అమరావతి, విజయవాడ, రాజమహేంద్రవరం, పిఠాపురం, విశాఖపట్నం, రంపచోడవరం, చెన్నైలోని శ్రీవారి ఆలయాల్లో, బెంగళూరు, వేలూరులోని సమాచార కేంద్రాల్లో ఈనెల 2న 50 వేలు, 3న 13 వేలు, 4న 9,500 లడ్డూలు విక్రయించినట్టు తెలిపారు. టీటీడీ స్థానిక ఆలయాలు, సమాచార కేంద్రాల్లో కూడా లడ్డూలు పొందవచ్చన్నారు.

నిధుల మంజూరుకు కృషి

చిల్లకూరు, సెప్టెంబరు 4: వరదల సమయంలో తీరప్రాంత గ్రామాలు ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకునేందుకు కేంద్రప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని మోమిడి, వరగలి తదితర ప్రాంతాల్లో కూటమిపార్టీ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వరదల సమయంలో కండలేరు క్రీకు నుంచి వచ్చే నీటి ధాటికి లింగవరం, మోమిడి, తమ్మినపట్నం, గుమ్మళ్లదిబ్బ తదితర తీరప్రాంత గ్రామాలు ముంపునకు గురవుతుంటాయన్నారు. త్వరలో క్రిస్ సిటీ శంకుస్థాపనకు రానున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

కోట, సెప్టెంబరు 4: పట్టణంలోని మహాత్మాజ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకులంలో బుధవారం మండల ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు జరిగాయి.కబడ్డీ, షాట్‌పుట్, లాంగ్‌జంప్, వాలీబాల్, త్రోబాల్, మ్యూజికల్ చైర్స్ జరిగాయి. విజేతలకు గురువారం మండల విద్యావనరుల కేంద్రంలో బహుమతులు అందిస్తారు.

కోటవాసికి బంగారు పతకం

కోట, సెప్టెంబరు 4 : పట్టణానికి చెందిన షాజిద్‌బాషాకు పవర్ లిఫ్టింగ్ పోటీలో బంగారు పతకం లభించింది.నేపాల్ దేశంలో గత నెల 31వ తేదీ నుంచి ఈనెల 4వ తేదీ వరకు జరిగిన పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో షాజిద్‌బాషా ప్రాతినిధ్యం వహించాడు. ప్రతిభా పాటవాలు కనబరచి బంగారు పతకం, 3 వెండి పతకాలను సాధించాడు.

చెన్నై వైద్యశాలకు వెళ్లి పింఛను అందజేత

సూళ్లూరుపేట, సెప్టెంబరు 4:మన్నారుపోలూరు న్యూకాలనీకి చెందిన జి.ఆనందయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడి చెన్నై జీహెచ్‌లో మోకాలి శస్త్రచికిత్స చేసుకొని అక్కడే ఉంటున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకొన్న సచివాలయ కార్యదర్శి పి.కృష్ణయ్య బుధవారం చెన్నై జీహెచ్‌కి వెళ్లి ఆనందయ్యకు పింఛను అందజేశారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు మానుకోండి

గూడూరు, సెప్టెంబరు 4: ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌పై ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని జనసేన ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు టి.చంద్రశేఖర్ అన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో అయన మాట్లాడుతూ... నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడుతున్న ఎమ్మెల్యేపై ఎమ్మెల్సీ విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. ఎమ్మెల్సీగా గూడూరు అభివృద్ధికి ఆయన ఏం చేశారో ప్రజలకు తెలుసు కాబట్టే సునీల్ కుమార్‌ను ప్రజలు గెలిపించారన్నారు. మోహన్, సాయికిరణ్, సనత్, మనోజ్‌కుమార్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 4: పట్టణంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఎస్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నెల్లూరుకు చెందిన స్మార్ట్‌విజన్ ఆసుపత్రి సహకారంతో కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సందీప్ మాట్లాడుతూ... శరీరంలోని ఇతర భాగాల మాదిరిగానే కళ్లకు కూడా సమస్యలు వస్తుంటాయన్నారు. సమీప దృష్టి, దూరదృష్టి వంటి సమస్యలను ప్రారంభంలోనే గుర్తించేందుకు వైద్యపరీక్షలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రసాద్, విష్వక్సేనారెడ్డి, కోటేశ్వరరావు, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా చవితి పందిళ్ల ఏర్పాట్లు

నాయుడుపేట, సెప్టెంబరు 4: చవితి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు వాడవాడలా ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. దర్గావీధిలో సినిమా సెట్టింగ్ తరహాలో రూ.15 లక్షలతో 22 అడుగుల వినాయక ప్రతిమను తయారుచేస్తున్నారు. 8 రోజులుగా ఒడిశాకు చెందిన కార్మికులు వినాయక చవితి వేదికను నిర్మిస్తున్నారు. శెట్టిపల్లివారివీధి, పడమటివీధి, రామకృష్ణాపురం, బస్టాండ్, రాజగోపాలపురం, పిచ్చిరెడ్డితోపు, బ్రాహ్మణవీధి తదితర ప్రాంతాలలో భారీ వినాయక ప్రతిమలను ఏర్పాటు చేయనున్నారు.

విజయవాడ సహాయక చర్యల్లో కురుగొండ్ల


భోజనాన్ని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, సెప్టెంబరు 4 : విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం సహాయక చర్యలు ముమ్మరం చేసిందని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం ఆయన వెంకటగిరి నుంచి తన అనుచరులతో విజయవాడ చేరుకున్నారు. సింగ్ రోడ్‌లో వరద బాధితులకు ఆహార పట్లాలు, తాగునీటి బాటిళ్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ... గత నాలుగు రోజులుగా సీఎం చంద్రబాబు విజయవాడలోనే ఉంటూ వరద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటున్నారని చెప్పారు. కొద్దిరోజుల్లో విజయవాడలో సాధారణ పరిస్థితి తీసుకు వచ్చేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నారన్నారు. సీఎం ఆదేశాల మేరకు వెంకటగిరి నుంచి పెద్ద ఎత్తున టీడీపీ కార్యకర్తలు, నాయకులు తరలివచ్చి సహాయక చర్యల్లో పాల్గొంటూ బాధితులకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. బి.రాజేశ్వరరావు, ఎం.ఆనంద్, ఎ.సత్యనారాయణ, ఆర్.సత్యం, పి.పెంచల నరసయ్య నాయుడు, ఆర్.రాజా, టీవీఆర్ తదితరులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకుందాం


ఎమ్మెల్యేకు చెక్కులు అందిస్తున్న దాతలు

గూడూరు, సెప్టెంబరు 4: విజయవాడలో వరదబాధితులను ఆదుకునేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఆడిటర్ శ్రీకంటి రామ్మోహన్‌రావు రూ.50 వేలు, ఆర్టీసీ బస్టాండు సమీపంలోని షిర్డీ సాయిబాబామందిరం ఆధ్వర్యంలో రూ.లక్ష, రోటరీ వెస్ట్ క్లబ్ రూ.50వేల చెక్కులను సీఎం సహాయనిధికి ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వరదల కారణంగా విజయవాడ, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీఎం చంద్రబాబు అక్కడే ఉంటూ బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తూ వారికి కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేసేలా నిరంతరం పని చేస్తున్నారన్నారు. ఈ వయసులో కూడా మోకాళ్ల నీటిలో పర్యటిస్తూ బాధితులకు భరోసా కల్పిస్తున్నారన్నారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని సీఎం సహాయనిధికి తన నెల జీతం రూ.1.50లక్షలు అందిస్తున్నానన్నారు.చెంచురామయ్య, సనత్‌కుమార్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, కృష్ణయ్య, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అందుబాటులోకి తెస్తా

గూడూరు, సెప్టెంబరు 4: ఉచిత ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చెప్పారు. బుధవారం ఎమ్మెల్యే నివాసంలో భవననిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఉచిత ఇసుకను అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ సందర్భంగా నిర్మాణ సంఘం నాయకులు మాట్లాడుతూ గూడూరుకు సమీపంలో ఇసుక పాయింట్లు లేకపోవడంతో కొనుగోలు చేయాలంటే దూరప్రాంతాల నుంచి అధిక ధరలు వెచ్చించాల్సి వస్తుందని దీంతో పనులు సక్రమంగా లేక నిర్మాణరంగ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే ఇసుక పాయింట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుని తక్కువ ధరకు ఇసుకను అందించేందుకు తన వంతు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో శివకుమార్, రఫీ, శంకరయ్య, శేఖరాచారి, బీవీరమణయ్య, సురేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిమల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

కోట, సెప్టెంబరు 4: చవితి మండపాలు, ప్రతిమల ఏర్పాటుకు అనుమతి తప్పని సరి అని గూడూరు డీఎస్పీ వివి రమణకుమార్ చెప్పారు. కోట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ... గణేశ నిమజ్జనాలను వాకాడు మండలం దుగరాజపట్నం, తూపిలిపాళెం, కోట మండలం శ్రీనివాససత్రం సముద్రతీరాల్లో మాత్రమే నిమజ్జనాలకు అనుమతించామన్నారు. ఆయన వెంట కోట, వాకాడు ఎస్‌ఐలు పవన్‌కుమార్, నాగబాబు, తదితరులు ఉన్నారు.

వెంకటగిరి టౌన్: వినాయకచవిత ప్రతిమలు ఏర్పాటు చేసుకునే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతులు తీసుకోవాలని వెంకటగిరి సీఐ రమణ తెలిపారు. బుధవారం స్థానిక కింజలవీరయ్య కల్యాణమండపంలో ఆయన మాట్లాడుతూ... భారీ వినాయక ప్రతిమలు ఏర్పాటు చేసే నిర్వాహకులు నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. ప్రతిమల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరిగితే నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని మహిళ మృతి

దొరవారిసత్రం, సెప్టెంబరు 20 : పట్టణంలోని జాతీయ రహదారి పక్కన ఓటుగుంట చెరువు కట్ట సమీపంలో చెట్లమాటున గుర్తు తెలియని మహిళ మృతదేహం పడి ఉన్నట్టు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు, ఎస్ఐ అజయ్‌కుమార్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మహిళ వయసు సుమారు 35 నుంచి 40 యేళ్లు ఉంటాయని చెప్పారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎంపీడీవో వెంకటేశ్వరరావుకు సాదర వీడ్కోలు

వాకాడు, సెప్టెంబరు 4: మండలంలో సంవత్సరంపైగా ఎంపీడీవోగా విధులు నిర్వహించి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న ఎంపీడీవో ఐ.వెంకటేశ్వరరావును ఏఎన్ఆర్ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో సన్మానించి వీడ్కోలు పలికారు. తహసీల్దారు రామయ్య, మాజీ ఎంపీడీవో టి.గోపీనాథ్, కె. భక్తవత్సలరెడ్డి, డి.మధుసూదన్‌రెడ్డి, ఎస్.విజయశేఖర్‌రెడ్డి, కుంచం దయాకర్, డీటీ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

చెట్ల సంరక్షణతోనే మానవాళి మనుగడ



దక్కిలి, సెప్టెంబరు 4 చెట్ల సంరక్షణతోనే మానవాళి మనుగడ ఆధారపడి ఉంటుందని ఎంపీడీవో ప్రసన్న కుమారి అన్నారు. బుధవారం బాలయోగి బాలికల గురుకుల కళాశాలలో వనమహోత్సవంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అడవులు అంతరించి పోవడం, చెట్ల నరికివేత వల్లే ప్రకృతి విపత్తులు సంభవిస్తున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. గురుకుల కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగమణి, వైద్యాధికారి శ్రీహరిరావు, బింధు ప్రియాంక, ఎంఈవోలు పి.జగదీష్ బాబు, వెంకటేశ్వర్లు, గురుకుల కళాశాల విద్యాకమిటీ చైర్మన్ ఎస్.రత్నయ్య తదితరులు వున్నారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

బొజ్జల కుటుంబంపై విమర్శలు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న విజయకుమార్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 4: బొజ్జల కుటుంబపై విమర్శలు చేయడం సరికాదని టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి మచ్చలేని నాయకుడుగా ప్రజల గుండెల్లో నిలిచి పోయారని కొనియాడారు. అలాంటి కుటుంబం నుంచి వచ్చిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిపై విమర్శలు చేయడం సరికాదన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అవినీతి బయటపడుతుందన్న భయంతోనే టీడీపీపై విమర్శలు చేస్తున్నారని తెలిపారు. రాజీవ్‌నగర్‌లో అక్రమాలను విచారిస్తున్న అధికారులు అక్కడ జరిగిన అవకతవకలను గమనించి తలలు పట్టుకుంటు న్నారని అన్నారు. గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనతో శ్రీకాళహస్తి అభివృద్ధి 20సంవత్సరాల వెనక్కు వెళ్లిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన 80రోజుల్లోనే శ్రీకాళహస్తీశ్వరాలయం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను మూసివేసిన ఘనత వైసీపీకే దక్కిందన్నారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన తల్లి బృందమ్మ, సతీమణి రిషితారెడ్డి ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తుంటే విమర్శలు చేయడం తగదన్నారు. వైసీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోని డ్రైనేజీలు, వీధి దీపాలు, వసతిగృహాల అభివృద్ధి సుధీర్‌రెడ్డి ఎమ్మెల్యే అయ్యాక చేశారన్నారు. సెంటు భూమి కబ్జా చేసినా తన గడపతొక్కవద్దని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి టీడీపీ నాయకులను హెచ్చరించారన్నారు. బొజ్జల కుటుంబం అంటే అవినీతి రహిత పాలనకు మారుపేరని, అలాంటి కుటుంబంపై విమర్శలు చేయడం తగద న్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెంచయ్య నాయుడు, కామేష్ యాదవ్, సుబ్బయ్య, చెలికం పాపిరెడ్డి, మిన్నల రవి, డిల్లీబాబు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో టీడీపీ నేతలకు ఊరట

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 4: హత్యాయత్నం కేసులో టీడీపీ నేతలకు ఊరట లభించింది. న్యాయవాది సాయిరాం కథనం మేరకు.... శ్రీకాళహస్తి మండలం ఎంపేడు గ్రామానికి చెందిన లింగయ్య, అతని బంధువులు మరో ఆరుగురు టీడీపీలో చురుగ్గా వ్యవహరించేవారు. యేడాది క్రితం ఎంపేడులో లింగయ్య వర్గానికి, వైసీపీకి చెందిన రాజేష్ వర్గంతో ఘర్షణ జరిగింది. శ్రీకాళహస్తి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ సానుభూతిపరులైన లింగయ్యతో పాటు అతని బంధువులు ఆరుగురిపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఇరువర్గాల వాదనలు పరిశీలించిన సీనియర్ సివిల్ జడ్జి బేబీరాణి బుధవారం కేసును కొట్టివేసినట్లు న్యాయవాది సాయిరాం తెలిపారు.

మునీశ్వర్‌రెడ్డికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 4: తొట్టంబేడు మండలం గుండేలిగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కందాటి మునీశ్వర్ రెడ్డికి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కింది. గురువారం ఉపాధ్యాయ దినోత్సవం సంద ర్భంగా తిరుపతిలో కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదు గా అవార్డు అందుకోనున్నారు. మునీశ్వర్‌రెడ్డి గత 24 ఏళ్లుగా ఎంతోమంది విద్యార్థు లను, వెనుకబడిన తరగతుల వర్గాల పిల్లలను చేరదీసి ఉత్తమ బోధన అందించారు. కేరీర్ గైడెన్స్ ఇవ్వడం ద్వారా ఎంతోమంది విద్యార్థులు మంచి ఉద్యోగాల్లో స్థిరపడేలా చేశారు. గుండేలిగుంట పాఠశాల విద్యార్థులు నాలుగేళ్లుగా గణితంలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా మునీశ్వర్‌రెడ్డి విశేషంగా కృషి చేశారు.

విద్యుత్ సమస్యలపై రైతులకు అవగాహన

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 4: తొట్టంబేడు మండలంలోని బోనుపల్లి సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ సమస్యలపై రైతులకు అవగాహన సదస్సు బుధ వారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ బాలాజీ మాట్లాడుతూ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో 11కేవీ ఫీడర్లు విద్యుత్ అంతరాయానికి కారణాలను, నివారణ చర్యల గురించి వివరించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 4: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుం దని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి అన్నారు. తొట్టంబేడు మండలంలోని తంగేళ్లపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవా లను నిర్వహించారు. ఈ సందర్భగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలిం తలు, చిన్నారులు చిన్నారులు పౌష్టికాహారాన్ని తీసుకుని రక్తహీనత లేకుండా జాగ్రత్త పడాలన్నారు. మాతా, శిశుమరణాలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు మోహన్‌నాయుడు, అంగన్ వాడీ కార్యకర్తలు భారతి, పద్మావతి, మంజుల, మోహన్‌రాణి, మణెమ్మ, లక్ష్మి, సహాయకురాలు రాజేశ్వరి, తేజోవతి తదితరులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై అవనాక్షమ్మ దివ్యదర్శనం



నారాయణవనం, సెప్టెంబర్ 4: మండల పరిధిలోని సముదాయం గ్రామంలో వెలసిన అవనాక్షమ్మ ఆలయ జాతరలో భాగంగా బుధవారం రాత్రి అమ్మవారు సింహ వాహనం మహిషాసురమర్థినిగా ఊరేగుతూ భక్తులకు దర్శనమి చ్చారు. 15 రోజుల పాటు నిర్వహిం చే జాతరలో చివరి మూడు రోజులు అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తు న్నట్లు ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. బుధవారం ఉదయం ఆల యాన్ని శుద్ధి, తోమాల తదితర నిత్య కార్యక్రమాలు నిర్వహించారు. అనం తరం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, నిత్యపూజా కైంకర్యాలు చేపట్టారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారిని సర్వాంగ సుందరంగా సుగంధ పుష్పాలను, స్వర్ణాభరణాలను అలంకరించుకున్న అమ్మవారు సింహ వాహ నంపై అధిరోహించి గ్రామవీధుల్లో విహరించారు. భక్తులు కర్పూర నీరజ నాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఏఈవో పార్థసారధి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ ఉత్సవాలను పర్యవేక్షించారు.

భావి తరాలను తీర్చిదిద్దే బాధ్యత గురువులదే



ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 4: భావితరాలను తీర్చిదిద్దే బాధ్యత గురువులదేనని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని వీఎస్ఎన్ కల్యాణ మండపంలో రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ చైర్మన్ డాక్టర్ రమేష్‌నాథ్, సమన్వయకర్త దేవరాజులు ఆధ్వర్యంలో నగరి నియోజకవర్గంలో ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులకు గురుబ్రహ్మ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ సేవా పురస్కారాలు అందజేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన భానుప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో తమకంటే ఉన్నత స్థాయిలో ఉండాలని విద్యను అందించే నిస్వార్థ వ్యక్తిత్వం గురువులేనని అన్నారు. తన తండ్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు సైతం అధ్యాపక వృత్తి నుంచి విద్యాశాఖమంత్రిగా సేవలందించారని గుర్తుచేశారు. అనంతరం ఉపాధ్యాయులకు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంటైనర్ బోల్తా

వరదయ్యపాళెం, సెప్టెంబరు 4: మండలంలోని శ్రీసిటీ పరిధిలోని తొండూరు వద్ద ఓ కంటైనర్ బోల్తా పడిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.... తమిళనాడు నుంచి శ్రీసిటీకి సరుకుల లోడుతో వస్తున్న కంటైనర్ తొండూరు సొసైటీ మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కంటైనర్‌ను పక్కకు తొలగించారు.

కుటుంబ కలహాలతో కూలీ ఆత్మహత్యాయత్నం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 4: కుటుంబ కలహాలతో సుబ్రహ్మణ్యం(35) అనే కూలీ ఆత్మహత్యాయత్నానికి పాల్ప డ్డాడు. ఈ ఘటన బుధవారం రాత్రి శ్రీకాళహస్తి పట్టణం లోని తెట్టు ప్రాంతంలో జరిగింది. కూలీ పనులు ముగించు కుని ఇంటికి చేరుకున్న సుబ్రహ్మణ్యానికి కుటుంబ సభ్యు లతో వాగ్వాదం చోటు చేసుకుంది. మనస్తాపం చెందిన ఆయన గదిలోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు గమనించి హుటాహుటినా శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.

కట్ట పుట్టాలమ్మ జాతరకు చాటింపు

రేణిగుంట, సెప్టెంబరు 4: రేణిగుంట మండలం కరకం బాడి పంచాయతీ పరిధిలోని కట్టపుట్టాలమ్మ జాతరకు మంగళవారం రాత్రి చాటింపు వేశారు. ఈ నెల 10, 11 తేదీలో జాతర నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

మత్తుకు బానిసైతే జీవితాలు చిత్తు

నాగలాపురం, సెప్టెంబరు 4: గంజాయి, మద్యం, గుట్కా వంటి మత్తు పదార్థాలకు బానిసై యువత, విద్యార్థులు తమ జీవితాలను పాడు చేసుకోవద్దని ఎస్ఐ సునీల్ కుమార్ అన్నారు. బుధవారం నాగలాపురంలోని అక్షర జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు చెడు వ్యసనాల నివా రణ, సైబర్ క్రైంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు విద్యపై శ్రద్ధ పెట్టి ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు.

ఇసుక టిప్పర్ సీజ్

ఏర్పేడు, సెప్టెంబరు 4: ఏర్పేడు మండలం పాపానా యుడుపేట సమీపంలోని స్వర్ణముఖి నది నుంచి బుధ వారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు సీజ్ చేశారు. డ్రైవర్ చంద్రశేఖర్, యజమాని శివకుమార్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ జయచంద్ర తెలిపారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

ఏర్పేడు, సెప్టెంబరు 4: రాష్ట్రంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు విజయవాడ ప్రాంతం అతలాకు తలం అయిన విషయం తెలిసిందే. అనేకమంది పేదలు, వృద్ధులు తిండి, ఆశ్రయం లేక ఇబ్బందులుపడుతున్నారు. వారిని ఆదుకోవడానికి ఏర్పేడు మండలం టీడీపీ నాయ కులు బుధవారం విరాళాల సేకరణ చేపట్టారు.

రమేష్‌బాబుకు సన్మానం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 4: శ్రీకాళహస్తి పురపాలక సంఘం పూర్వ కమిషనర్ రమేష్‌బాబును పలువురు సన్మానించారు. రమేష్‌బాబు ఇటీవల పొన్నూరు పురపాలక సంఘ కమిషనర్‌గా బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తికి చెందిన పలువురు బుధవారం ఆయనను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో కలవగుంట భరత్‌రెడ్డి, జ్యోతీరావ్, చంద్రమౌళి, పఠాన్ ఫరీద్, చంద్ర బాబు, రమణారెడ్డి, రమేష్, వంశీ, తింట, మగదీప్, వినోద్, ఇమ్రాన్, చిట్టిబాబు, బాలాజీ, వెంకటరావు పాల్గొన్నారు.

ఆహ్వానపత్రికల ఆవిష్కరణ

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 4: పట్టణంలోని గాంధీవీధిలో వెలసిన జ్ఞానసిద్ధి వినాయకస్వామి ఆలయంలో జరిగే చవితి వేడుకల ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ బుధవారం ఊరందూరులో ఆవిష్క రించారు. కమిటీ సభ్యులు కాసరం రమేష్, పైనంపాటి సుధాకర్, కోరా రాకేష్, వివేక్‌గౌడ్, నవీన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ వేడుక

ఏర్పేడు, సెప్టెంబరు 4: ఏర్పేడు, సీతారాంపేట అంగన్ వాడీ కేంద్రాల్లో పోషణ వేడుక నిర్వహించారు. తెలుగు మహిళా అధ్యక్షురాలు గాలి కృష్ణవేణి, ఏర్పేడు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు శోభారాణి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ భారతి హాజరయ్యారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సంధ్య, లక్ష్మి, విజయలక్ష్మి, అన్నపూర్ణ, అనూష, లత, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి: ఆదిమూలం



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నాగలాపురం, సెప్టెంబరు 4: సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. బుధవారం నాగలాపురం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో బాబు ఆధ్వర్యంలో మండల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియో జకవర్గంలో ప్రజలకు ఏ కష్టం వచ్చినా తక్షణమే స్పందించి పరిష్కరిస్తానని చెప్పారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు అందరూ అధికారు లతో సమన్వయం చేసుకుని అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. అధ్వాన పరిస్థి తుల్లో ఉన్న నాగలాపురం, సత్యవేడు, నారాయన వనంలోని తహసీల్దారు కార్యా లయాల స్థానంలో నూతన భవనాలను నిర్మించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. మండలంలోని ద్వారకానగర్, గొడ్డేరువాగు కాజ్‌వే పనులకు త్వరలో టెండర్లను పిలిచి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అలాగే టీపీకోట రోడ్డు పనుల ప్రతిపాదనను ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానని, త్వరలో నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. సమావేశంలో అధికారులు తమ శాఖల్లో అభివృద్ధి పనుల గురించి వివరించారు. అంతకుమునుపు నూతనంగా నిర్మించిన పంచాయతీ కాంప్లెక్స్ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కాగా, సర్వసభ్య సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రమే పాల్గొనాల్సి ఉండగా వైసీపీ, బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొనడంతో చర్చనీయాంశంగా మారింది. తహసీల్దార్ హనమాన్ నాయక్, ఎంపీపీ సింధు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ గేట్ మరమ్మతులు

వేగవంతం చేయండి: కలెక్టర్



రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

కేవీబీపురం, సెప్టెంబరు 4: కాళంగి రిజర్వాయర్ గేట్ మరమ్మతు పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశిం చారు. బుధవారం సాయంత్రం కేవీబీపురం మండల పరిధిలోని కాళంగి రిజర్వాయర్‌ను తెలుగు గంగ ఎస్ఈ మదనగోపాల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరితగతిన రిజర్వాయర్ గేట్ మరమ్మతులు చేపట్టాలని సూచించారు. అక్కడి రైతులతో మాట్లాడారు. అలాగే తెలుగు గంగ కెనాల్ నీరు తిరుపతి పట్టణానికి అందించే ఆఫ్టఎక్ పాయింట్, కోకో కోలా కంపెనీకి నీరందించేందుకు చేపడుతున్న ఆఫ్‌టెక్ పాయింట్‌ను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, డీఈ ఆదినారాయణ, తహసీల్దార్ దస్తగిరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుకాసురులపై ఉక్కుపాదం

ఏర్పేడు, సెప్టెంబరు 4: ఏర్పేడు మండలంలో పెట్రేగిపోతున్న ఇసుకా సురులపై ఉక్కుపాదం మోపుతామని సీఐ జయచంద్ర అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలో పాపానాయుడుపేట నుంచి ముసలిపేడు వరకు స్వర్ణముఖి నది నుంచి అక్రమార్కులు రాత్రింబవళ్లు తేడా లేకుండా తరలించుకుపోతున్నారని ఆయా గ్రామాల ప్రజలు తన దృష్టికి తీసుకు వచ్చారన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా ఇసుకాసురలపై ప్రత్యేక నిఘా ఉంచి ఉక్కుపాదం మోపుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం ఉదయం వికృతమాల వద్ద స్వర్ణముఖి నది ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకను తీసుకెళుతున్న ఓ టిప్పర్‌ను సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా పాపానాయుడుపేట పరిసర గ్రామాల్లో యువత గంజాయి ముఠా, డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు తెలిసిందన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా గంజాయి విక్రయం, వినియో గిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

ప్రజారవాణాను సద్వినియోగం చేసుకోండి



బస్సును ప్రారంభిస్తున్న ఆదిమూలం

వరదయ్యపాళెం, సెప్టెంబరు 4: ప్రజా రవాణాలో కీలకపాత్ర పోషిస్తున్న ఆర్టీసీ సర్వీసులను ప్రయా ణికులు సద్వినియో గం చేసుకోవాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మండలం లోని సంత వేలూరు వద్ద వరదయ్యపాళెం - సూళ్లూరుపేట ఆర్టీసీ సర్వీ సును ఎమ్మెల్యే ఆదిమూలం బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు సమస్యను తన దృష్టికి తీసుకు రావడంతో ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు సర్వీసును ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజరు, నాయకులు యుగంధర్‌రెడ్డి, నిర్మల్, ఆణిముత్యం నందకిషోర‌రెడ్డి, పవన్ నాయుడు, మహేష్, శ్రీనివాసులు నాయుడు, జయచంద్ర నాయుడు, హరి, చలపతి నాయుడు, శివ, బూర్సు దశరధయ్య, కరుణాకర్ నాయుడు, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి మెరుగైన విద్యుత్ సరఫరా

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 4: వ్యవసాయానికి మెరుగైన విద్యుత్ సరఫరా చేస్తామని ట్రాన్స్‌కో ఏఈ పుణ్యకోటి తెలిపారు. మండలంలోని వెస్ట్‌వరత్తూరు సబ్‌స్టేషన్‌లో పరిధిలో విద్యుత్ సమస్యలపై బుధవారం ఫిర్యాదులు స్వీకరించారు.

రేపు జాబ్ మేళా

సత్యవేడు, సెప్టెంబరు 4: సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో రాష్ట్ర నైపుణ్యాభి వృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్సేంజ్, సిడాప్, డీఆర్డీఏ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ(శుక్రవారం) జరగనున్న మెగా జాబ్‌మేళాను నియద్యోగ యువతీ యువ కులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆదిమూలం పిలుపునిచ్చారు. బుధ వారం మెగా జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదిమూలం మాట్లాడుతూ జాబ్‌మేళాలో శ్రీసిటీ, చెన్నైకు చెందిన 10 బహుళ జాతి పరిశ్రమల్లో 500కి పైగా ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం మాట్లాడుతూ ఇంటర్వ్యూలకు హాజరయ్యే యువతీ యువకులు సంబంధిత లింక్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9440374535, 9491458910 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు ది బెస్ట్ ఎంప్లాయిబిలిటీ ఇన్షియేటివ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న రవికుమార్, సతీష్ రాళ్లపల్లి

రేణిగుంట, సెప్టెంబరు 4: అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ది బెస్ట్ ఎంప్లాయిబిలిటీ ఇన్షియేటివ్ అవార్డు దక్కించు కుంది. బుధవారం బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో జియాంగ్సీ బిజినెస్ సెంటర్ డైరెక్టర్ జాంటీ జంగ్, కంబోడియా కాన్సులేట్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, యూసి దారివాల్ చేతుల మీదుగా జాతీయ హెచ్ఆర్ ఎక్సలెన్స్ అవార్డును అమరరాజా ఫౌండేషన్ సభ్యులు అందు కున్నారు. యువతలో నైపుణ్యం, విజ్ఞానం పెంపొందించి మెరుగైన జీవనోపాధి అవకాశాలను అందిస్తున్నందుకు ఈ లభించినట్లు ప్రకటించారు.

బీజేపీ సభ్యత్వ నమోదులో అగ్రస్థానంలో నిలవాలి



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 4: బీజేపీ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలో శ్రీకాళహస్తి నియోజకవర్గం అగ్రస్థానంలో నిలిచేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో బుధవారం సభ్యత్వ నమోదుపై నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, రమేష్‌బాబు, రమణ, శైలజ, అమర్‌నాథ్ దితరులు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 4: గర్భిణులు ప్రతి నెలా క్రమం తప్ప కుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ దివాకర్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం గర్భిణులకు డాక్టర్లు మాధవి, దివాకర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తం తక్కువగా ఉన్న వారికి సుక్రోజ్ ఇంజక్షన్లు ఇచ్చారు. గర్భిణులు ఆకుకూరలు, పండ్లు, పాలు, గుడ్లు వంటి బల వర్ధకమైన ఆహారం తీసుకోవాలన్నారు. మొదటి కాన్పు వారు ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం కింద నమోదు చేసుకుంటే కేంద్ర ప్రభుత్వం రూ.5వేలు బ్యాంకు ఖాతాలో వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తల్లి పాలతో రోగనిరోధక శక్తి

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 4: పుట్టిన బిడ్డకు తల్లి పాలు పట్టించడం వల్ల శిశువుకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అంగనవాడీ సూపర్‌వైజర్ శిల్ప తెలిపారు. బుధవారం మండలంలోని ఆలత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. తల్లిపాలు, పౌష్టికాహారంపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఆరు మాసాల వరకు బిడ్డకు తల్లి పాలు మాత్రమే తాగించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగనవాడీ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 4: విద్యార్థులు చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. ధ్యానచంద్ జయంతిని పురస్కరించుకుని ఆగస్టు 29నుంచి వారం రోజుల పాటు క్రీడా దినోత్సవ వేడుకలను నిర్వహించి విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. బుధవారం వారికి డీఎస్పీ నరసింహమూర్తి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. సైబర్‌క్రైమ్, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రూపాదేవి, ఏజీఎం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 4: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరయ్య పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో కొత్తగా చేరినా విద్యా ర్థులకు పరిచయ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు సెమిస్టర్ విధానం, సింగిల్ మేజర్ సబ్జెక్టులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుజన, నరసిం హులు, వాణిశ్రీ, పద్మావతి, నాగేశ్వరరావు, తిరుమలయ్య, రఘు, గంగయ్య పాల్గొన్నారు.

డీఎస్పీకి సన్మానం



పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 4: పుత్తూరు డీఎస్పీ రవికుమార్‌ను పట్టణంలోని ముస్లిం మైనారిటీ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో హమీద్ బాష, రఫీ, యాసిన్ భాష, సలీం, షకీల్, సనావుల్లా, రసూల్ పాల్గొన్నారు.

వైభవంగా గంగజాతర



ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను సన్మానిస్తున్న జాతర కమిటీ సభ్యులు

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 4: పుత్తూరు పట్టణంలో వెలిసిన పిడికిలి గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. చాటుబండిపై ప్రత్యేక పుష్పాలంకరణలో ఉన్న అమ్మవారు మంగళ వాయిద్యాల నడుమ పట్టణ పురవీధుల్లో ఊరేగారు. భక్తులు కర్పూర హారుతుల ఇచ్చి, కుంభాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను స్సన్మానించారు. కార్యక్రమంలో జాతర కమిటీ సభ్యులు మధు, శ్రీనివాసులు, వెంకటేష్, విక్కీరాయల్, మున్సిపల్ మాజీ చైర్మన్ యుగంధర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ధనపాల్, షణ్ముగ రెడ్డి, సుధాకర్, గోపీ ఆచారి తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ మంత్రి రోజా అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర కమిటీ నిర్వాహకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అటవీ సంరక్షణ నిబంధనలు పాటించాలి



భూములను పరిశీలిస్తున్న అటవీ శాఖాధికారులు

వడమాలపేట, సెప్టెంబర్ 4: అటవీ సంరక్షణ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని పుత్తూరు అటవీ బీట్ అధికారి గంగులయ్య అన్నారు. బుధవారం బట్టీకండ్రిగ యానాది కాలనీలో ప్రజలకు అవగాహన కల్పించారు. కొన్నేండ్లుగా అటవీ భూములను సాగు చేసుకుంటున్నామని, ఇప్పటికీ ఎలాంటి ఆధారాలు లేవని యానాదులు విన్నవించారు. సంబంధిత భూములను పరిశీలించిన అధికారులు ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పారు. అటవీ సంపదను కాపాడాలని, జంతువుల వేట నిషేధమని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.